అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా..

- జిల్లావ్యాప్తంగా ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు
- సోదరులకు రక్షా బంధాలు కట్టిన సోదరీమణులు 8



అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా జరిగే రాఖీ పౌర్ణమి జిల్లాలో శనివారం ఘనంగా జరిగింది. ఆయా గ్రామాలు, పట్టణాల్లోని సోదరీమణులు తమ సోదరులకు రక్షాబంధన్‌లు కట్టి తమ ప్రేమ చాటుకున్నారు. పలుచోట్ల మహిళలు తమ ప్రియతమ రాజకీయ నేతలకు రాఖీలు కట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

రామచంద్రపురంలో మంత్రి సుభాష్‌కు రాఖీలు కడుతున్న నియోజకవర్గ మహిళలు

రక్షాబంధ(మ్)న్! 7



వెలుగు.. తగ్గింది!

మోరిలో జీడిపప్పు గుండ్లు

- అమ్మకాలు లేక నీరసిస్తున్న జీడిపప్పు పరిశ్రమ
- మోరి జీడిపప్పు అంటే ఒకప్పుడు ఎంతో క్రేజ్
- ఇతర ప్రాంతాల్లోకి వ్యాపారం విస్తరించడంతో తగ్గిన డిమాండ్
- యంత్రాలు రాకతో మహిళలకు తగ్గిపోయిన ఉపాధి

మలికిపురం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మోరి జీడిపప్పు.. ఒకప్పుడు ఎంతో వెలుగు వెలిగింది. అమెరికా వంటి ప్రాంతాలకు సైతం ఎగుమతుల్లో ఎంతో ప్రాముఖ్యత సంపాదించుకుంది. కానీ, ఈ పరిశ్రమ ఇప్పుడు అమ్మకాలు లేక నీరసిస్తోంది. పూర్వం మహారాజుల సమయాల్లో మోరి జీడిపప్పుకి ప్రత్యేక స్థానం ఉండేది. సినిమాల్లో కూడా విందు కార్యక్రమాల్లో ఈ జీడిపప్పు ప్రస్తావన వస్తుండేది. అటువంటి పరిశ్రమ రోజురోజుకూ పలు గ్రామాలకు విస్తరించడంతో ఉత్పత్తి పెరిగి డిమాండ్ లేక వ్యాపారస్తులు ప్రత్యామ్నాయాల వైపు దృష్టి మరలిస్తున్నారు.

వ్యాపారంలో పోటీ పెరగడంతో..

గతంలో జీడిపప్పు వ్యాపారం అంటే ఎంతో హుందాగా ఉండేది. ఇప్పుడు వ్యాపారంలో పోటీ పెరిగి లాభాలు రాక ఈ పరిశ్రమపై ఆధారపడేవారు నిరాశ నిస్పృహలు వ్యక్తం చేస్తున్నారు. పూర్వం పొయ్యలపై కాల్చి పప్పు తయారుచేసేవారు. ఆ పప్పు ఎంతకాలమైనా నిల్వ ఉండేది. బాయిలర్ పరిశ్రమలు రావడంతో తయారీ కూడా సులువు కావడంతో ఉత్పత్తి ఎక్కువ జరుగుతోంది. గతంలో మనుషుల శ్రమ జీడి పరిశ్రమ ఆధారపడి ఉండేది. ఆధునికీకరణ, యంత్రాల ప్రవేశంతో పప్పు ఒలిచే ఫ్యాక్టరీలు ఎక్కడికక్కడ వెలిశాయి. దీంతో ఇక్కడి మహిళల ఉపాధికి గండి పడింది. గతంలో మహిళలే హీట్ హౌస్ నుంచి వచ్చిన పప్పును శుభ్రపరిచి కేటగిరీల ప్రకారం తయారుచేసేవారు. యంత్రాలు వచ్చాక మనుషులకు పనిలేకుండా పోయింది. జీడిగింజలు కొట్టే మిషన్లు కేవలం రూ.7వేలకు రావడంతో ఇతర ప్రాంతాల్లో కూడా ఈ వ్యవస్థ పెరిగింది. దీంతో తయారీ ఎక్కువ అవుతోంది.



హీట్ హౌస్‌లో వేడి చేయడానికి సిద్ధం చేస్తున్న జీడిపప్పు

ఉభయ గోదావరి జిల్లాల్లో విస్తరణ

మోరికే పరిమితమై ఉండే జీడిపరిశ్రమ ఉభయ గోదావరి జిల్లాల్లో పలుచోట్ల వేనూళ్లకుంది. దీంతో మోరి కంటే తక్కువ రేటుకు ఆయా ప్రాంతాల వారు ఇవ్వడంతో ఇక్కడి జీడిపప్పుకు డిమాండ్ తగ్గింది. ప్రస్తుతం కాల్చిన జీడిపప్పు కిలో ధర రూ.780 వరకు రూ.800 వరకు ఉండగా బాయిలర్ పప్పు కిలో రూ.680 నుంచి రూ.720 మధ్య జరుగుతోంది. నాటు గింజలు 80 కిలోలబస్తా రూ.13,500 ఉండగా విదేశాల నుంచి దిగుమతి చేసుకునే గింజలు రూ.10వేల నుంచి రూ.13వేల వరకు ధర పలుకుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం జీడిపప్పు పరిశ్రమను కుటీర పరిశ్రమగా భావించి ముద్ర రుణాలు వంటి ఇచ్చి ప్రోత్సహించాలని పలువురు కోరుతున్నారు. జీడిపప్పుపై ఉన్న వాణిజ్య పన్నుల శాతాన్ని తగ్గించాల్సిన అవసరం కూడా ఉందన్న డిమాండ్ వినిపిస్తోంది. ఈ పరిశ్రమపై ఆధారపడే మహిళలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రభుత్వం ప్రకటించాలని, అణగారిపోతున్న జీడిపప్పు పరిశ్రమ అభివృద్ధికి ప్రజాప్రతినిధులు కూడా సహకారం అందించాలని వ్యాపారస్తులు కోరుతున్నారు. జీడిపప్పు పరిశ్రమలకు రాయితీతో కూడిన విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని విన్నవిస్తున్నారు.

ఆదివారం ప్రత్యేకం



ఆలోచించండి.. అమ్మానాన్న!

కలిసొచ్చే కాలానికి.. నడిచొచ్చే పిల్లలు

- సరోగసి సెంటర్లకు ఎందుకు దండగ
- నవమాసాలు మోయనక్కర్లెద్దు
- దత్తత తీసుకోండి మనసు నిండుగా
- కేంద్ర ప్రభుత్వం 'పోస్టర్ కేర్' స్కీమ్
- రెండేళ్లకు తాత్కాలిక దత్తత
- ఆరేళ్ల నుంచి 18 ఏళ్ల పిల్లలు
- నచ్చితేనే శాశ్వత అడాప్షన్
- ఎవరికి నచ్చకపోయినా రద్దు
- ఆత్మీయతను పెంచడమే లక్ష్యం
- కారా వెబ్‌సైట్‌లో దరఖాస్తు

కలిసొచ్చే కాలానికి నడిచొచ్చే పిల్లలు.. అవును ఇది నిజమే.. ఆ తల్లి నవమాసాలు కష్టపడి మోయాల్సిన అవసరం లేదు.. ఆసు పత్రుల చుట్టూ తిరగాల్సిన పనీ లేదు..కాస్త పెద్ద మనసుతో ఆలోచిస్తే అమ్మా నాన్న స్థానం దక్కుతోంది.. బిడ్డను ప్రేమగా పెంచుకోవచ్చు. మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే.. ఒక చిన్నారిని దత్తత తీసుకోవడమే.. అదీ శాశ్వతంగా కాదండోయ్.. రెండేళ్ల పాటు ఆ చిన్నారిని ప్రేమగా చూడండి.. నచ్చిందా శాశ్వతంగా దత్తత తీసుకోవచ్చు.. లేదంటే మళ్లీ వెనక్కు ఇచ్చేయవచ్చు. ఈ మేరకు కేంద్రం ఫోస్టర్ కేర్(తాత్కాలిక సంరక్షణ) అంటూ ఒక కొత్త పథకం అందుబాటులోకి తెచ్చిం ది..అమ్మా నాన్న ఆలోచించండి..సరోగసి సెంటర్లకు ఎందుకు దండగ..'ఒక బిడ్డను దత్తత తీసుకోండి'.

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

పిల్లలు లేరని ఎంతో మంది బాధపడుతుంటారు.. మొక్కని దేవుడు ఉండడు..వెళ్లని ఆలయం ఉండదు.. వేసుకోని మందులు ఉండవు.. దేవుడిపై భారం వేసి సూటిపోటి మాటలు పడుతూ నిత్యం కన్నీళ్లతో కాలం వెళ్లదీస్తూ ఉంటారు.బిడ్డలు కావాలని వెయ్యి కళ్లతో ఎదురు చూస్తూ ఉంటారు.పలువురు లక్షలు తగ లేసి సరోగసీ ఆసుపత్రుల చుట్టూ తిరుగుతుంటారు.. మా రక్తమే కావాలంటూ పట్టుబడుతుంటారు.. ప్రస్తుతం సరోగసీ ఆసుపత్రుల్లో మాయాజాలం చూస్తుంటే అసలు పుట్టిన బిడ్డ ఎవరి బిడ్డ అనే ఆలోచన రాక మానదు.అంత కష్టపడి.. ఆరోగ్యం పాడు చేసుకుని బిడ్డను కనాలా.. ఒకరిని దత్తత తీసు కుని పెంచుకుంటే బిడ్డకాదా..? 9 నెలలు మోసి కంటేనే బిడ్డ అవుతుందా? ప్రేమగా పెంచినా బిడ్డే కదా.. కేంద్ర ప్రభుత్వం కూడా ఇదే ఆలోచించింది.. ఒక కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది..అనాథాశ్రమంలో బిడ్డను దత్తత తీసుకున్నా జీవితాంతం పెంచాల్సిన అవసరం లేదు. మొదట రెండేళ్ల పాటు పెంచవచ్చు.. మనకు అన్నీ నచ్చితేనే శాశ్వతంగా దత్తత తీసుకోవచ్చు. లేదంటే ఎక్కడి నుంచి తీసుకొచ్చారో అక్కడే వదిలేయవచ్చు. సంతానం లేని తల్లిదండ్రులు..అమ్మానాన్నల ప్రేమానురాగాలు అందుకోలేని పిల్లలకు మధ్య ఆత్మీయ అనుబంధాన్ని కల్పిస్తూ.. తల్లిదండ్రుల ఆదరణ లేని పిల్లలకు తాత్కాలిక సంరక్షణ అందించే వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం తెచ్చింది. అదే ఫోస్టర్ కేర్.

దత్తత ఇచ్చేది వీరినే..

6- 12 ఏళ్ల మధ్య ఉన్న పిల్లలను దత్తత తీసుకునే తల్లిదండ్రుల వయసు 35 నుంచి 55 ఏళ్ల మధ్య ఉండాలి. 12-18 ఏళ్ల మధ్య వయసు ఉన్న పిల్లలను దత్తత తీసుకునే తల్లిదండ్రుల వయసు 35-60 ఏళ్ల మధ్య ఉండాలి. చిన్నపిల్లలను దత్తత తీసుకుంటే ఆ బాలల సంరక్షణకు ఒక్కొక్కరికి నెలకు రూ.4 వేలు చొప్పున రెండేళ్ల పాటు ఆర్థిక సాయం అందించనున్నారు. ఈ మొత్తం బాలల విద్య, ఆరోగ్యపరమైన అవసరాల కోసం వెచ్చించాల్సి ఉంది. సోదర, సోదరి బంధాలతో ముడిపడి ఉన్న అనాథలను విడదీయరు.

అమ్మా నాన్నలకో అవకాశం..

6 నుంచి 18 ఏళ్లలోపు పిల్లలను రెండేళ్ల పాటు పెంచి..అనంతరం శాశ్వతంగా దత్తత పొందే అవకాశం ఈ ఫోస్టర్ కేర్ ద్వారా కలుగుతోంది.పిల్లలు వివిధ కారణాల వల్ల తమ కుటుంబాలకు దూరంగా ఉన్నప్పుడు ఫోస్టర్ అడాప్షన్ తల్లిదండ్రులు, వారి ప్రేమ, ఆప్యాయత అందించాలి.పిల్లలను ప్రేమగా పెంచాలి. విద్య, ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అటువంటి బాలబాలికలు, తల్లిదండ్రులు ఎవరైనా ఉంటే గుర్తించే పనిలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారులు ఉన్నారు. అభాగ్యులు, అనాథలకు ఈ పథకం ఒక వరమని చెప్పొచ్చు. కొన్ని రోజుల పాటు తమకు నచ్చిన జీవితాన్ని అనుభవించే అవకాశం ఉంది. సంతానం లేని తల్లిదండ్రులకు అమ్మా నాన్న అని పిలిపించుకునే అవకాశం ఉంది.

ఎవరు అర్హులంటే..

దత్తత తీసుకునే వ్యక్తి కచ్చితంగా భారతీయ పౌరుడై ఉండాలి. దీర్ఘకాలిక అనారోగ్యాలు ఉండకూడదు. భావోద్వేగాల నియంత్రణ లేని వ్యక్తులకు దత్తత ఇవ్వరు. ఫోస్టర్ కేర్ ఆశించే తల్లిదండ్రులు ఆర్థికంగా సామర్థ్యం కలిగి ఉండాలి. ఏదైనా నేరపూరిత చర్యలో దోషిగా నిర్ధారించి ఉండకూడదు. పిల్లల హక్కుల ఉల్లంఘన కేసుల్లో నిందితులు లేదా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు దత్తత తీసుకోవడానికి అనర్హులు.

దరఖాస్తు.. చేయండిలా..

పిల్లలు లేని దంపతులు, పిల్లలు ఉండి ఇంకా కొంతమందిని పెంచగలం అనుకునే వారు ఈ పోస్టర్ కేర్ ద్వారా రెండేళ్ల కాలపరిమితితో తాత్కాలిక దత్తత పొందవచ్చు. రెం డేళ్లు పూర్తయిన తర్వాత ఇరువురికి సమ్మతమైతే తాత్కాలిక దత్తత కొనసాగించొచ్చు. పోస్టర్ కేర్‌కు ఆన్‌లైన్‌లో www.cara.nic. inలో దరఖాస్తు చేసుకోవాలి. ముందుగా వెబ్‌సైట్‌లో లాగిన్ కావాలి. ప్రస్తుత కుటుంబ ఫొటో, గుర్తింపు, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాలు అందించాలి. మెడికల్ సర్టిఫికెట్‌తో పాటు ఆదాయ ధ్రువీకరణ తప్పనిసరి. దంపతులైతే వివాహ ధ్రువీకరణ పత్రం, వేరుపడితే విడాకుల కోర్టు ఆదేశాలు, సమాజంలో పే రు న్న ఇద్దరు వ్యక్తుల హామీ అవసరం. గ్రూప్ ఫోస్టర్ కేర్ అవకాశం ఉంది. 8 మంది వరకు పిల్లలను గ్రూపుగా దత్తత తీసుకునే అవకాశం ఉంది.రెండేళ్ల వ్యవధిలో పిల్లల ఇష్టం లేదా పెంచిన వ్యక్తుల పెంపకం సరిగా లేదని నిర్ధారణకు వస్తే తక్షణమే దత్తత రద్దు చేస్తారు. గతంలో నుంచి అప్పుడే పుట్టిన పిల్లల నుంచి 18 నెలల వయసు ఉన్న అనాథలను దత్తత ఇచ్చేవారు పోస్టర్ కేర్‌లో బాలల సంరక్షణ, వసతి గృహాల్లో మగ్గిపోతున్న పిల్లలను కారా అనే వెబ్‌సైట్ ద్వారా దత్తత తీసుకోవచ్చు.

అనాథలకు అమ్మా నాన్నను ఇస్తాం..

అనాథ బాలల జీవితాలకు తల్లిదండ్రుల ప్రేమను అందించడంతో పాటు దంపతుల జీవితాల్లో పిల్లలు లేని లోటు తీర్చి వారి జీవితాలను సంపూర్ణం చేయడమే పోస్టర్ కేర్ లక్ష్యం. ఈ పథకం ఎంతో మందికి పిల్లలు లేని లోటు తీర్చుతుందనడంతో సందేహం లేదు.
- సీహెచ్ వెంకట్రావు, కాకినాడ జిల్లా బాలల పరిరక్షణాధికారి



ఇది తాత్కాలిక దత్తత విధానం

పోస్టర్ కేర్ తాత్కాలిక దత్తత ప్రక్రియ. దీన్ని శాశ్వత దత్తత విధానంగాను మార్చుకోవచ్చు.దత్తత కావాలనుకునే వారు బాలల పరిరక్షణ అధికారి సీహెచ్ వెంకట్రావును, జిల్లా బాలల సంరక్షణాధికారి కె.విజయను సంప్రదించాలి.
- సీహెచ్ లక్ష్మి, పీడీ, ఐసీడీఎస్ కాకినాడ జిల్లా

ముగిసిన పవిత్రోత్సవాలు 6

బాలల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి పీఎం రాష్ట్రీయ బాల పురస్కార్-2025కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్న జిల్లా స్త్రీ, శిశుసంక్షేమశాఖ అధికారిణి శాంతకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదర్శప్రాయమైన పనులు జాతీయస్థాయిలో క్రీడలు, శాస్,సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, ఆర్ట్స్ లలిత కళలు, వినూత్నమైన సేవల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన 18ఏళ్లలోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చునని ఆమె పేర్కొన్నారు.ఆసక్తి ఉన్నవారు ఈనెల 15లోగా వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు.

'మురమళ్ల' ట్రస్టుబోర్డు ఏర్పాటుకు నోటిఫికేషన్

ఐ.పోలవరం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరా స్వామిదేవస్థానం ట్రస్టుబోర్డు నియామకానికి ఈనెల 7న దేవదాయధర్మదాయశాఖ కమిషనర్ నోటిఫికేషన్ విడుదల చేసినట్టు అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. 20రోజుల్లోగా ఆసక్తి గలవారు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఉదయం 9నుంచి 5గంటలలోపు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఇంటర్ చదివే విద్యార్థులకు అవకాశం

మలికిపురం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): చదువు మధ్యలో నిలిపివేసిన వారు తిరిగి విద్యను కొనసాగించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో సార్వత్రిక విద్యాపీఠం పర్యవేక్షణలో ఇంటర్మీడియట్ కోర్సులు అభ్యసించడానికి అవకాశం కల్పిస్తోందని మలికిపురం డిగ్రీ కళాశాల కోఆర్డినేటర్ పీడీకే ప్రసాద్ తెలిపారు. వివిధ విశ్వవిద్యాలయాలు, ప్రైవేటు సంస్థల్లో దూర విద్యావిధానంలో చదువుకోవడానికి వీలుందన్నారు. విద్యా వికాసం, సాధికారిత పెంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ అవకాశం కల్పిస్తోందని తెలిపారు.



వాడపల్లి వెంకన్న ఆలయంలో ఎస్పీకి స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఈవో చక్రధరరావు

వాడపల్లి వెంకన్న ఆలయంలో ఎస్పీ పర్యటన

ఆత్రేయపురం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో జిల్లా ఎస్పీ కృష్ణారావు శనివారం సాయంత్రం పర్యటించారు. వివిధ రాష్ట్రాల నుంచి వేలాదిగా తరలి వస్తున్న భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను స్వయంగా పరిశీలించారు. పోలీస్ శాఖ చేపడుతున్న రక్షణ చర్యలు మాడవీధుల్లో పార్కింగ్, క్యూలైన్లను ఆయన పరిశీలించి తగు సూచనలను అందచేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలుచేపట్టాలని పోలీస్‌శాఖ తమవంతు సహకారం అందిస్తుందన్నారు. తొలుతగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. వేదపండితుల ఆశీర్వచనం అందుకుని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు స్వామివారి చిత్రపటం అందచేసి భక్తులకు అందిస్తున్న సేవలను అందించారు. ఆయన వెంట డీఎస్పీ సుంకర మురళీమోహన్, సీఐ విద్యాసాగర్, ఎస్ఐలు రాము, నరేష్ పాల్గొన్నారు.

పరుపుల కంపెనీలో అగ్నిప్రమాదం 7



ఆక్వాకు ట్రంప్ దెబ్బ!

- ట్రంప్ 50శాతం సుంకం ఎఫెక్ట్‌తో ఆక్వారంగం కుదేలు
- సుంకం విధించకుండానే తగ్గిన రొయ్యల ధరలు
- ఎగుమతి, దిగుమతిదారులు కుమ్మక్కై.. రైతులకు కుచ్చుటోపీ

అంతర్జాతీయ విపణిలో 'డాలర్ల' సిరులు కురిపించే ఆక్వా రంగం అమెరికా అధ్యక్షుడు డోనాల్డట్రంప్ దెబ్బకు విలవిల్లాడుతోంది. రొయ్యల ఎగుమతులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 50శాతం సుంకం విధించడంవల్ల ఉత్పత్తిదారుడైన రైతుకే తీవ్ర నష్టం కలుగుతోంది. రష్యా-భారత్ సంబంధాల నేపథ్యంలో ట్రంప్ భారత్‌పై వివిధ రకాల పరిశ్రమల ఉత్పత్తులపై సుంకాన్ని విధిస్తూ ఇటీవల నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఇక్కడినుంచి అమెరికాకు ఎగుమతి అవుతున్న ఆక్వా ఉత్పత్తులు సంక్షోభంలో చిక్కుకున్నాయి.

(అమలాపురం-ఆంధ్రజ్యోతి):

అమెరికాలోని దిగుమతిదారులు భారత్‌లోని ఎగుమతిదారుల మధ్య కుదిరిన పరస్పర అవగాహనలతో పెరిగిన సుంకాలు విభజిస్తూనే రొయ్యలు పండించే రైతులను మాత్రం నిలువు దోపిడీ చేస్తున్నారు. కొన్నినెలల వ్యవధిలో అమెరికా సుంకం ప్రభావంతో భారత్‌లోని ఆక్వా ఎగుమతిదారులు తమ కష్టాన్ని దోచుకున్నారని రైతులు గగ్గోలు పెడుతున్నారు. 50శాతం సుంకం ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని రైతులు ఆక్వా సాగు చేయాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఓ నిర్ణయం తీసుకుని ధరలు నిర్ణయించి ఉత్పత్తిదారులైన తమకు మేలు చేయాలని రైతులు కోరుతున్నారు.

అమెరికా సుంకంతో తగ్గిన ధరలు

అమెరికా వివిధ రకాల వస్తువుల ఉత్పత్తులపై 50శాతం సుంకాన్ని విధించింది. దీంట్లో ప్రధానమైన ఆక్వా ఉత్పత్తులపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంది. సాధారణంగా వచ్చే క్రిస్మస్ నాటికి రొయ్యల కొనుగోళ్లు అమెరికాలో అనూహ్యంగా ఉంటాయి. దీంతో ఆ సమయానికి భారత్‌తోపాటు ఏపీ వంటి రాష్ట్రాలనుంచి అమెరికావాసులకు కావాల్సిన 20, 30, 40, 50 కౌంట్ రొయ్యలను ఎగుమతి చేస్తుంటారు. దాన్ని సాకుగా చూపి 60నుంచి 100 కౌంట్ లోపు ఉన్న రొయ్యల ధరలను కిలోకు రూ.40కు పైగానే తగ్గించి ప్రస్తుతం ఉత్పత్తిదారుడైన ఆక్వా రైతుల నుంచి కొనుగోలు చేసి వారిని నిలువునా దోచేస్తున్నారు. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి రొయ్యలు ఉత్పత్తి చేస్తున్నప్పటికీ ఎగుమతిదారులు సిండికేట్‌గా మారి రైతుల కష్టాన్ని నిలువునా దోచేస్తున్నారని ఈసారి అమెరికా సుంకం ప్రభావాన్ని సాకుగా చూపి కిలోకు రూ.40 నుంచి రూ.50 మేర ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. మొదట్లో ట్రంప్ 25శాతం సుంకం విధించినప్పుడు అమెరికా, భారత్‌లోని ఎగుమతి, దిగుమతిదారులు సిండికేట్‌గా మారి ఆ సుంకం మొత్తాన్ని ఇరువురూ విభజించుకున్నారు. అమెరికాలో రొయ్యలను దిగుమతి చేసుకుని వారు 10 నుంచి 12 శాతం సుంకాన్ని భరించేలా ఒప్పందాన్ని కుదుర్చుకున్నారని, అయినా ఆసమయంలో రైతుల నుంచి ధరలు తగ్గించి కొనుగోలు చేయడంవల్ల మధ్యలో బాగుపడింది ఆక్వా ఎక్స్‌పోర్టర్స్ అని రైతుల ప్రధాన ఆరోపణ.ఇప్పుడు ఈ సంక్షోభం నుంచి బయట పడాలంటే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ట్రంప్ విధించిన సుంకాల్లో కొంత మేర భరించి ఆక్వా ఉత్పత్తి చేసే రైతులకు రాయితీలు కల్పిస్తే తప్ప ఈపరిశ్రమ కోలుకునే పరిస్థితి లేదని చెబుతున్నారు. ఇదేపరిస్థితి కొనసాగితే ఏపీతోపాటు జిల్లావ్యాప్తంగా ఆక్వా రైతులు క్రాప్ హాలిడేకు దిగనున్నట్టు రైతుల హెచ్చరికలను బట్టి తెలుస్తోంది.

సుంకాలు లేకుండానే.. ధరల తగ్గింపా

-అల్లూరి రమేష్‌రాజు, జిల్లా ఆక్వా కమిటీ చైర్మన్



ట్రంప్ విధించిన సుంకాలవల్ల కిలో రూ.40 తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. సుంకాలు అమలు కాకుండానే ఎక్స్‌పోర్టులు పన్నులు మినహాయించి ధరలు చెల్లిస్తున్నారు. ఇతర కౌంట్‌లపై కూడా అమెరికా మాదిరిగానే పన్ను మినహాయిస్తున్నారు. సుంకాల బారినుంచి బయట పడాలంటే ఆక్వారైతులకు రూ.1.50కే యూనిట్ విద్యుత్ ఇవ్వాలి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలివ్వాలి

-త్సవటపల్లి నాగభూషణం, రాష్ట్ర ఆక్వా ఫెడరేషన్ సలహాదారుడు



అమెరికా-భారత్‌లోని ఆక్వా ఎగుమతి, దిగుమతిదారుల మధ్య పరస్పర అవగాహనతో వ్యాపారలావాదేవీలు జరుగుతున్నాయి. మొదట్లో ట్రంప్ విధించిన 25శాతం సుంకం ఇరుదేశాలు చెరిసమానం భరించేలా ఒప్పందాలు కుదిరాయి. ఇప్పుడు 50శాతంసుంకంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలు ఇచ్చి ఆదుకోకపోతే ఎగుమతులు చేయడం కష్టం.

ఆక్వా రైతులకే నష్టం

-కె.వెంకట్రాజు (కేవీ రాజు), రొయ్యల కొనుగోలుదారు



సుంకాల ప్రభావం చివరిగా రైతులపైనే పడుతోంది. ఏ దేశం సుంకం విధించినా నష్టపోవాల్సింది ఆక్వా రైతులే. అక్కడ సుంకాల అమలు లేకుండానే ఇక్కడ ఎగుమతిదారులు రైతులను నిలువు దోపిడీ చేసి తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారు. వంద కౌంటు రొయ్యలను ఇష్టారాజ్యంగా కొనుగోలుచేసి రైతులకు ఆర్థికంగా నష్టం చేకూరుస్తున్నారు. ప్రభుత్వాలే ఆక్వారంగానికి ప్రోత్సాహకాలు ఇవ్వాలి.

భక్తజన వాడపల్లి



ఆత్రేయపురం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): శ్రావణ శనివారం స్వామి జన్మనక్షత్రం కావడంతో వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో శోభిల్లింది. వేకువజామునే స్వామికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాల భోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. పలు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు తీరువీధుల్లో ఏడు ప్రదక్షణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ క్షేత్రంలో పర్యటించి మెడికల్ క్యాంపును పరిశీలించారు. తమ సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.47 లక్షలు లభించినట్టు ఉపకమీషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

అప్పనపల్లి కిటకిట



మామిడికుదురు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. శ్రావణమాసం శనివారం కావడంతో పెద్ద ఎత్తున భక్తజనం తరలివచ్చారు.ఈ మేరకు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి మూలవిరాట్ విగ్రహాలను వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. వేకువజామునే వేద మంత్రోశ్చరణలతో సుప్రబాత సేవ నిర్వహించి ఘనంగా తొలిహారతి ఇచ్చారు. దేవస్థానంలో శనివారం శ్రావణ పౌర్ణమి పురస్కరించుకుని శ్రవణా నక్షత్రమాస కల్యాణ సేవను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గోవిందనామ స్మరణలతో దేవస్థానం మార్మోగింది.శనివారం స్వామికి రూ.3,53,720 ఆదాయంగా వచ్చింది. స్వామివారిని 5వేల మంది భక్తులు దర్శించుకున్నారు. 3 వేల మంది అన్నప్రసాదం స్వీకరించారని సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు.

భక్త వల్లభుడు!



పెద్దాపురం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): భక్తుడు ఏ ఎత్తులో ఉంటే ఆ ఎత్తులో కనిపించే స్వామి ఉన్నారు తెలుసా.. ఆయనే మండలంలోని శృంగారవల్లభ స్వామి..ఈ క్షేత్రానికి మరొక పేరుంది.. అదే తొలి తిరుపతి.. ప్రతి శనివారం పెద్ద ఎత్తున భక్తజనం హాజరై స్వామిని దర్శించుకుంటారు. శ్రావణమాసం స్వామి జన్మనక్షత్రం సందర్భంగా శనివారం సుమారు 10 వేల మందికి పైగా భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి ఆలయం భక్తులతో కిటకిటలాడింది.ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పెద్ద ఎత్తున బారికేడ్లు పెట్టారు. ఆలయంలో స్వామివారికి అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శనివారం ఒక్కరోజే అన్ని సేవల ద్వారా రూ.3,10,502 ఆదాయం లభించినట్టు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.

క్రీడలకు కేరాఫ్ కాకినాడ


కాకినాడ జిల్లా క్రీడామైదానంలోని ఆస్ట్రోటర్ఫ్ హాకీ కోర్టులో తలపడుతున్న క్రీడాకారులు(ఫైల్)

- ఇప్పటికే నాలుగు జాతీయ స్థాయి హాకీ టోర్నమెంట్‌ల నిర్వహణ
- తాజాగా మరోసారి జాతీయస్థాయి మహిళా చాంపియన్‌షిప్
- ఐపీఎల్ ఫైనల్ ఫ్యాన్ పార్క్ ఏర్పాటు
- ఏపీఎల్ లీగ్‌లోకి కాకినాడ కింగ్స్ జట్టుకు చోటు
- కాకినాడ వేదికగానే జట్టు ప్రాక్టీస్, లోగో, జెర్సీ ఆవిష్కరణ
- రూ.5కోట్లతో ఆస్ట్రో-టర్ఫ్ స్టేడియానికి అంతర్జాతీయ ప్రమాణాలు

కార్పొరేషన్(కాకినాడ),ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): పెన్షనర్స్‌హబ్‌గా..పేరడైజ్‌సిటీగా పేరొందిన కాకినాడ ఇప్పుడు క్రీడలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఇక్కడ ఇప్పటికే నాలుగు జాతీయస్థాయి హాకీ టోర్నమెంట్లు జరగ్గా 5వ జాతీయస్థాయి టోర్నమెంట్ కాకినాడ జిల్లా క్రీడామైదానంలో జరుగుతోంది. ఒకవైపు హాకీ, మరోవైపు క్రికెట్ క్రీడకు సంబంధించి ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌లోకి కాకినాడ కింగ్స్‌జట్టు ఎంట్రీఇచ్చింది. విశాఖపట్నంలో శుక్రవారంనుంచి ప్రారంభైన ఆంధ్రప్రీమియర్ లీగ్‌లో పోటీపడేందుకు కాకినాడ కింగ్స్ జట్టు ఐదురోజులు కాకినాడ రంగరాయ క్రీడామైదానంలో ప్రాక్టీస్ చేసింది. జట్టు పరిచయ కార్యక్రమం, లోగో, జెర్సీ ఆవిష్కరణ వంటి కార్యక్రమాలు కాకినాడ వేదికగానే నిర్వహించారు. కాకినాడ కింగ్స్ జట్టుకు భారత క్రికెట్ టీం సభ్యులైన భరత్ కెప్టెన్‌గా వ్యవహరించడంతోపాటు ఐదు రోజులుగా కాకినాడలోని జట్టుతో కలిసి ప్రాక్టీస్ చేశారు.అంతకుముందు ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా కాకినాడ డీఎస్ఏ గ్రౌండ్‌లో ఫ్యాన్ పార్కు ఏర్పాటుచేశారు. ఎంపీ సానాసతీష్ చొరవతో ఉచితంగా ఈ వేడుకను ఏర్పాటుచేయడంతో క్రీడాభిమానులు ఎంతగానో ఆస్వాదించారు.

ఆస్ట్రో-టర్ఫ్ హాకీ స్టేడియం

కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో ఉన్న ఆస్ట్రో-టర్ఫ్ హాకీ స్టేడియం అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేయడంతో 2022లో జూనియర్ హాకీ ఇండియా నేషనల్ ఉమెన్ టోర్నమెంట్‌కి 26 రాష్ట్రాల నుంచి క్రీడాకారులు చేశారు. 12రోజులపాటు సాగిన ఈ క్రీడలు ఎంతో ఆహ్లాద వాతావరణంలో జరిగాయి.

- 2023 ఆలిండియా సీనియర్ నేషనల్ ఉమెన్ టోర్నమెంట్ 26 రాష్ట్రాలు పాల్గొన్నాయి.
- 2025, ఫిబ్రవరిలో ఆలిండియా సివిల్ సర్వీస్ గర్నమెంట్.
- 2025, ఆగస్టులో 15వ హాకీ ఇండియా జూనియర్ మహిళ జాతీయ ఛాంపియన్‌షిప్‌లో 29రాష్ట్రాలు పాల్గొని ఆడుతున్నాయి. ఇప్పటికే లీగ్ దశ పూర్తి చేసుకున్న ఈ టోర్నమెంట్‌లో శనివారంనుంచి క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు ప్రారంభం కాబోతున్నాయి.

సౌకర్యాలతోపాటు మ్యాన్ పవర్

కాకినాడ వేదికగా జాతీయ స్థాయిలో ఏ టోర్నమెంట్ నిర్వహించినా అందుకు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆధ్వర్యంలో జిల్లా అధికార యంత్రాంగం ఎంతోప్రోత్సహిస్తోంది. అందుకు తగ్గట్టుగా టోర్నమెంట్ సజావుగా సాగేందుకు తగిన మ్యాన్ పవర్ కూడా అందుబాటులో ఉంటుంది. కలెక్టర్ సారథ్యంలో క్రీడాకారులకు కావాల్సిన వసతి భోజన సదుపాయాలు కల్పించడంతోపాటు తగిన ప్రోత్సాహం ఉంటుంది.



ఏపీఎల్ కాకినాడ కింగ్స్ జట్టు లోగో ఆవిష్కరిస్తున్న దృశ్యం(ఫైల్)

రానున్న రోజుల్లో అంతర్జాతీయ మ్యాచ్‌లు

కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, వీసీఎండీ హర్షవర్ధన్ సహకారంతో రూ.5కోట్లతో ఆస్ట్రో-టర్ఫ్ కోర్టులో ఫ్లడ్‌లైట్స్, ట్రాన్స్‌ఫార్మర్, సౌత్‌వైపు ప్రేక్షకులకు గ్యాలరీ వంటి సౌకర్యాలతో మరింత అభివృద్ధి చేయనున్నారు. దీంతో రానున్నరోజుల్లో అంతర్జాతీయ మ్యాచ్‌లకు ఈకోర్టు వేదికగా నిలవనుంది. ఇలా క్రీడలకు వేదికగా కాకినాడ జిల్లాలో జాతీయస్థాయి ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్లు జరుగుతున్నాయి. భవిష్యత్‌లో అంతర్జాతీయ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్ల నిర్వహణకు అధికారులు, నాయకులు కృషిచేస్తున్నారు. భవిష్యత్తులో కాకినాడ క్రీడలకు హబ్‌గా మారేలా టోర్నమెంట్లు జరుగుతున్నాయి.

- కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఫుట్‌బాల్(సాకర్) ఫీల్డ్, బాస్కెట్‌బాల్, టెన్నిస్, క్రికెట్, బ్యాడ్మింటన్ కోర్టులు, రన్నింగ్ ట్రాక్ ఇతర క్రీడాసదుపాయాలు కూడా ఉన్నాయి.
- సురేష్‌నగర్‌లో స్మార్ట్‌సిటీ ఆధ్వర్యంలో నిర్మించిన మల్టీపర్పస్ స్టేడియం కూడా త్వరలో అందుబాటులోకి రానుంది.ఇది కూడా అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించింది. మరిన్ని టోర్నమెంట్లు జరగడానికి ఎన్నో అవకాశాలున్నాయి.
- సీఎం చంద్రబాబు సైతం కాకినాడలో సెంట్రాఫ్ ఎక్సలెన్సీ ఏర్పాటుకోసం కేంద్ర క్రీడా శాఖమంత్రికి లేఖను కూడా అందజేయడం క్రీడాకారులందరికీ ఎంతో స్ఫూర్తినిచ్చిందని హాకీ ఆంధ్రప్రదేశ్, జిల్లా హాకీ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

హోరాహోరీగా హాకీ మహిళా క్వార్టర్ ఫైనల్

కార్పొరేషన్(కాకినాడ),ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): 15వ హాకీ ఇండియా జూనియర్ మహిళా జాతీయ ఛాంపియన్‌షిప్-2025లో భాగంగా కాకినాడ క్రీడామైదానంలోని ఆస్ట్రోటర్ఫ్ హాకీ ఫీల్డ్‌లో క్వార్టర్ ఫైనల్స్‌లో భాగంగా నాలుగు మ్యాచ్‌లు జరిగాయి. శనివారం జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లకు కాకినాడజిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, జోనల్ ఆర్మీరిక్రూట్‌మెంట్ అధికారి బ్రిగేడియర్ రాకేష్‌శర్మ ఆవాస్తిలు ముఖ్యఅతిథులుగా హాజరై మ్యాచ్‌లను వీక్షించారు. జార్ఖండ్ వర్సెస్ పంజాబ్‌జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌ను ప్రారంభించి ఇరుజట్ల క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడాస్ఫూర్తిని చాటుతూ ఉత్తమ ప్రతిభ కనబరచాలని క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.

క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ వివరాలు

ఒడిస్సా వర్సెస్ హర్యానా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో హర్యానా 4-1స్కోరుతో విజయం సాధించింది. ఛత్తీస్‌ఘడ్ వర్సెస్ మధ్యప్రదేశ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఇరుజట్లు 1-1 గోల్స్ నమోదుచేయగా షూట్ అవుట్‌లో ఛత్తీస్‌ఘడ్ 2-1 స్కోరుతో విజయం సాధించింది. జార్ఖండ్ వర్సెస్ పంజాబ్‌జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో జార్ఖండ్ 3-1స్కోరుతో విజయం సాధించింది. ఉత్తరప్రదేశ్ వర్సెస్ మహారాష్ట్ర జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఉత్తరప్రదేశ్ 2-1 స్కో రుతో విజయం సాధించింది. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్‌కుమార్, రాష్ట్ర హాకీ సంఘ కార్యదర్శి హర్షవర్ధన్, సంయుక్త కార్యదర్శి వి.రవిరాజు, కోశాధికారి పి.తామస్‌పీటర్, భవానిశంకర్ ఈ మ్యాచులను పర్యవేక్షించారు.

క్రీడాకారులకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

కాకినాడ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ మైదానంలో జరుగుతున్న 15వ జాతీయ జూనియర్ హాకీ టోర్నమెంట్‌లో భాగంగా లయన్స్ శ్రేయస్ క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు గుత్తుల సుశీల మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మకంగా మన కాకినాడ పట్టణంలో జరుగుతున్న జాతీయ హాకీ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సేవా కార్యక్రమాన్ని చేపట్టాలనే దృక్పథంతో తన వంతుగా సుమారు 200మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేస్తామని సెమీస్, ఫైనల్ మ్యాచ్‌లకు కూడా 200 వాటర్ బాటిల్స్, కూల్‌డ్రింక్స్‌ను క్లబ్ ఆధ్వర్యంలో పంపిణీ చేయనున్నామన్నారు. దీనిని స్ఫూర్తిగా తీసుకుని స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు వచ్చి క్రీడాకారులకు తమ వంతు సహకారాన్ని అందించి వారిని ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ గుత్తుల సుశీల, సెక్రటరీ సాపే సుధాకర్, గుత్తుల శ్రీనివాస్ పాల్గొన్నారు.


కాకినాడ క్రీడా మైదానంలో జార్ఖండ్-పంజాబ్ జట్ల మధ్య జరుగుతున్న హాకీ పోటీ

అయోధ్యకు సికింద్రాబాద్ నుంచి

ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు

సామర్లకోట, రాజమహేంద్రవరంలో హాల్ట్‌లు


భారత్ గౌరవ్ ఎక్స్‌ప్రెస్ రైలు

సామర్లకోట, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): అయోధ్య-కాశీ పుణ్యక్షేత్రయాత్ర పేరిట రైల్వే, ఐఆర్‌సీటీసీ సంయుక్తంగా ఒక ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలును సెప్టెంబరు 9న శనివారంరాత్రి సికింద్రాబాద్‌లో బయలుదేర నుంది. మరుసటి రోజు ఆదివారం సామర్లకోటకు చేరుకోనున్న ఈ ప్రత్యేక యాత్రా రైలు తొమ్మిది రాత్రులు, లేదా పది పగళ్లు సాగే యాత్రా స్పెషల్ ఇది. ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు సికింద్రాబాద్ నుంచి గౌరవ్ ఎక్స్‌ప్రెస్ రైలుగా నడువనుంది. శనివారం సామర్లకోట రైల్వే ఉన్నతాధికారికి అందిన సమాచారం ప్రకారం ఈ రైలు మొత్తంలో 639 సీట్లు అందుబాటులో ఉంటాయి. ఇందులో స్లీపర్ క్లాస్‌కు చెంది 237 సీట్లు, థర్డ్ ఏసీకి చెందిన 350సీట్లు, సెకండ్ ఏసీకి చెంది 52సీట్లు అందుబాటులో ఉంటాయి. ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు సికింద్రాబాద్ నుంచి బయలుదేరి ఖాజీపేట, వరంగల్, ఖమ్మం, విజయవాడ, గుడివాడ, భీమవరం, తణుకు, నిడదవోలు మీదుగా రాజమహేంద్రవరంనకు చేరుతుంది. సామర్లకోట, తునిల మీదుగా దువ్వాడ, పెందుర్తి, విజయనగరం స్టేషన్లలో హాల్ట్ సౌకర్యం ఉంది. ఆయా స్టేషన్లలో బోర్డింగ్, డీబోర్డింగ్ అయ్యే సదుపాయం ప్రయాణికులకు కల్పించారు. మార్గమధ్యలో పూరీ, కోణార్క్, బైద్యనాథ్‌ధామ్, వారణాసి, అయోధ్య, ప్రయాగరాజ్ పుణ్యక్షేత్రా లను దర్శించుకోవచ్చునని రైల్వే అధికారులు తెలిపారు. పూరీలో ప్రఖ్యాత జగన్నాథుడి ఆలయం, కోణార్క్ సూర్యదేవాలయం, దేవ్‌గడ్‌లో బాబా బైద్యనాథ్ మందిరాన్ని దర్శించవచ్చు. వారణాసిలో చరిత్ర ప్రసిద్ధిపొందిన కాశీవిశ్వనాథుడు, విశాలాక్షి అన్నపూర్ణ అమ్మవారి ఆలయాలలో పూజలు నిర్వహించుకోవచ్చును. సాయంత్రం గంగాహారతిని తిలకించవచ్చును. అయోధ్యలో చారిత్రాత్మక రామజన్మభూమిలో వెలిసిన రామ్‌లల్లా ఆలయాన్ని చూడవచ్చు. అక్కడ హనుమాన్ గర్హి దేవాలయంలో ప్రత్యేక పూజలలో పాల్గొనే అవకాశం ఉంది. ప్రయాగరాజ్‌వద్ద త్రివేణీ సంగమంతో ఈ ప్యాకేజీ టూర్ ముగుస్తోంది. ఈటూర్‌లో పాల్గొనే ఉత్సాహవంతులు సత్వరం తమ గమ్యస్థానాల నుంచి రిజర్వేషన్ టిక్కెట్లు పొందవచ్చని ఈఆర్‌సీటీసీ అధికారులు సామర్లకోట రైల్వే ఉన్నతాధికారులకు అందించిన సమాచారంలో తెలిపారు.

పోశమ్మగండి అమ్మవారి దర్శనాలు నిలిపివేత

దేవీపట్నం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొందూరు గ్రామంలో వెలసిన శ్రీగండిపోశమ్మ అమ్మవారి దర్శనాలు తాత్కాలికంగా నిలిపివేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. అమ్మవారి ఆలయంవద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుందని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ప్రాంతాలన్నీ వరదనీరు, బురదతో ఉన్నాయన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని తాత్కాలికంగా దర్శనాలు నిలిపివేశామని మరలా దర్శనాలు ప్రారంభించే తేదీ తెలిపేవరకు భక్తులు ఎవరూ ఆలయ పరిసరాల్లోకి రావద్దన్నారు.

భీమేశ్వరాలయంలో

ముగిసిన పవిత్రోత్సవాలు


పవిత్రోత్సవాల్లో అర్చకస్వాములు

ద్రాక్షారామ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో పవిత్రోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. ఈనెల 7న పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. గణపతి పూజ, పుణ్యాహవాచనం, కుచ్చత్రయం, పంచగవ్యప్రాసన, మండపారాధనలు, గణపతిహోమం, నారాయణహోమం, పంచాయతన హోమాలు, చండీ, రుద్రహోమాలు నిర్వహించారు. ఉదయం 11.15గంటలకు పూర్ణాహుతి నిర్వహించా రు. స్వామి, అమ్మవార్లకు అవబృధ స్నానములు, పరివార దేవతలకు అర్చనాధి కార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు. శాంతికల్యాణం జరిపారు. కార్యక్రమంలో ఆలయ సహాయకమిషనర్ అల్లు వెంకటదుర్గాభవానీ, వేదపండితులు, ఆలయ అర్చకులు, సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా రాఖీ(శ్రావణ) పౌర్ణమి

- శ్రీపాదుడికి రాఖీలు కట్టిన భక్తులు
- భక్తజనసంద్రమైన పిఠాపురం
- భారీగా తరలివచ్చిన మహారాష్ట్ర, ఉత్తరాది భక్తులు


ప్రత్యేక అలంకారంలో శ్రీపాదశ్రీవల్లభుడు, దత్తాత్రేయుడు, నృసింహ సరస్వతులు


పిఠాపురం శ్రీపాదశ్రీవల్లభుడికి రాఖీలు కడుతున్న మహారాష్ట్ర, ఉత్తరాది భక్తులు, రాఖీ కడుతున్న ఆలయ ఈవో సౌజన్య

పిఠాపురం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీపాదుడికి రాఖీలు కట్టేందుకు భక్తజనం పోటెత్తారు. రహదారులన్నీ జనసంద్రమయ్యాయి.మహారాష్ట్ర, ఉత్తరాది, తెలుగురాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ప్రత్యేక పూజలు వైభవంగా జరిగాయి. దేశవ్యాప్తంగా శ్రీపాదుని జన్మస్థానంగా ప్రసిద్ధిగాంచిన పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానం శ్రావణ(రాఖీ) పౌర్ణమి సందర్భంగా భక్తులతో కిక్కిరిసింది. మహారాష్ట్ర, గోవా, ఢిల్లీ, కర్నాటక, గుజరాత్, ఉత్తరప్రదేశ్, ఒరిస్సా, పశ్చిబెంగాల్‌తో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాలు నుంచి తరలివచ్చి తాము సోదరుడిగా బావించే శ్రీపాదశ్రీవల్లభుడికి రాఖీలు కట్టారు. దత్త స్వరూపంగా బావించే ఔదంబర వృక్షానికి రాఖీధారణ చేశారు. వాసవికన్యకా పరమేశ్వరి అమ్మవారు శ్రీపాదశ్రీవల్లభులకు రాఖీ కట్టిన పవిత్రదినం కావడంతో మహిళా భక్తులు రాఖీ కట్టేందుకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. కేవలం రాఖీదారణ కోసమే మహారాష్ట్రతో పాటు ఉత్తరాది రాష్ట్రాల భక్తులు ప్రత్యేకంగా వారంరోజులు ముందుగానే ఇక్కడికి తరలివచ్చారు. మహారాష్ట్ర, ఉత్తరాది భక్తులు తమ ఇంట ఇలవేల్పుగా శ్రీపాదుడిని పూజించడంతోపాటు సోదరుడిగా భావిస్తారు. తమ సోదరుల కంటే శ్రీపాదశ్రీవల్లభునికే రాఖీ కట్టేందుకు ప్రాముఖ్యత ఇస్తారు. రాఖీలు కట్టిన అనంతరం ఇక్కడ జరిగిన పూజాది కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. స్వామికి మహాన్యాసపూర్వక శతరుద్రాభిషేకం, హోమం, అభిషేకాలు జరిగాయి. అనంతరం శ్రీపాదశ్రీవల్లభుడు, దత్తాత్రేయస్వామి, నృసింహసరస్వతులను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. వచ్చిన భక్తులందరికి అన్నప్రసాద వితరణ జరిగింది. శ్రీపాదుని దర్శనంకోసం కిలోమీటరుమేర భక్తులు బారులు తీరారు. కాగా శ్రీపాదునికి వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయం నుంచి కమిటీ ప్రతినిధులు రాఖీలు, ప్రసాదాలు ప్రదర్శనగా తీసుకువచ్చి సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

ఇన్‌స్టిట్యూషనల్

డెవలప్‌మెంట్ ప్లాన్‌పై వర్క్‌షాప్


జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ను ప్రారంభించిన అతిథులు

జేఎన్టీయూకే, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): వర్శిటీలోని సెనేట్‌హాల్లో ఐక్యూఏసీ, కెపాసిటీ బిల్డింగ్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో రెండురోజులపాటూ నిర్వహించనున్న ఇన్‌స్టిట్యూషనల్ డెవలప్‌మెంట్ ప్లాన్(ఐడీపీ)పై వర్క్‌షాప్‌ను శనివారం ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్‌ఆర్కే ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ ఐడీపీ అనేది స్పష్టమైన లక్ష్యాలతో అనసంధానించే రోడ్ మ్యాప్ అన్నారు. ప్రత్యేక అతిథులుగా ఐఏఈ డైరెక్టర్ కె.వెంకటేష్, ప్రొఫెసర్ రుషికుమార్, ఎన్వీ రమణారావు, ఏ.రవీంద్రనాద్ పాల్గొని మాట్లాడారు. రెక్టార్,ఇన్‌చార్జి రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఎయిడెడ్ విద్యాసంస్థల

పూర్వవైభవానికి కృషి

- ప్రైవేట్ ఎయిడెడ్ పాఠశాలల సంఘం రాష్ట్ర నాయకుడు చిట్టిబాబు

కాకినాడరూరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రైవేట్ ఎయిడెడ్ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై సత్వరమే ప్రభుత్వం స్పందించాలని నియామకాలు తక్షణమే జీవో1 ప్రకారంగా జరిగేలా ఉత్తర్వులు జారీ చేయాలని ప్రైవేట్ ఎయిడెడ్ పాఠశాలల సంఘం రాష్ట్ర నాయకుడు చిట్టిబాబు ప్రభుత్వాన్ని కోరారు. కాకినాడ అశోక్‌నగర్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సంఘ న్యాయసలహాదారుడు, హైకోర్టు న్యాయవాది ఎం.శ్రీవిజయ్ మాట్లాడుతూ 2004నుంచి ఎయిడెడ్ విద్యాసంస్థలపై ఆంక్షలు విధిస్తూ వచ్చారని, హైకోర్టు ఉత్తర్వులను సైతం బేఖాతరుచేస్తూ అధికారులు కోర్టులో కేసులను ఎదుర్కొంటున్నారని రాబోయే రోజుల్లో ఎయిడెడ్ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందనే ఆశా భావం వ్యక్తం చేశారు. చిట్టిబాబు మాట్లాడుతూ ఇటీవల కోర్టు కేసుల నేపథ్యంలో మైనార్టీ, నాన్ మైనార్టీ పాఠశాలలుగా విభజించడం రాజ్యాంగ విరుద్ధమని దీనిపై న్యాయపోరాటానికి ప్రతీ పాఠశాల సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పలు ఎయిడెడ్ విద్యాసంస్థల కరస్పాండెంట్లు విజయ్య, నళిని, సాగర్ ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.


సమావేశమైన ప్రైవేట్ ఎయిడెడ్ పాఠశాలల సంఘం

ఆదివాసీల అభివృద్ధికి తోడ్పాటునిస్తాం

- ఐటీడీఏ ఏపీవో జగన్నాధరావు
- ఘనంగా ఆదివాసీ దినోత్సవం

చింతూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ దినోత్సవాన్ని ఐటీడీఏ ఆధ్వర్యంలో ఆదివాసీ నాయకులు శనివారం ఘనంగా జరుపుకున్నా రు. ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణలో ఆదివాసీ జెండాను ఐటీడీఏ ఏపీవో జగన్నాధరావు, ఆది వాసీ నాయకులు ఎగురవేశారు. అనంతరం ఏపీఆర్ కళాశాల ప్రాంగణంలో ఆదివాసీ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఆదివాసీ చిన్నా రులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. ఈ సందర్భంగా ఏపీవో జగన్నాధరావు మాట్లాడు తూ ఐటీడీఏ చేపట్టిన అభివృద్ధిని, మున్ముందు చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలను వివ రించారు. పోతనపల్లి సమీపంలో రెండు ఎకరా ల భూమిని ఆదివాసీ భవన్‌కోసం వెచ్చించ నున్నట్లు, అదేదశలో చింతూరు సెంటర్‌లో ఆదివాసీ జాతీయనేత బిర్సా ముండా విగ్రహాన్ని ఐటీడీఏ నేతృత్వంలో ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. అనంతరం పలువురు ఆదివాసీ నాయకులు మాట్లాడారు. ఆదివాసీ చట్టాలను పటిష్ఠంగా అమలుపర్చాలని కోరారు. మన్యంలో నూటికి నూరుశాతం ఉద్యోగ ఉపాధి అవకాశాలు స్థానిక ఆదివాసీలకే కేటాయించాలని వారంతా కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్, ఆదివాసీ జేఏసీ నాయకులు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వలస ఆదివాసీ గ్రామంలో...

ఛత్తీస్‌గఢ్ నుంచి వలసవచ్చి మన రాష్ట్రంలో నివసిస్తున్న ఆదివాసీలు వారి ఆవాసాల వద్ద ఆదివాసీ దినోత్సవం జరుపుకున్నారు. ఈ క్రమంలో చిమిలివాగు గ్రామంలో పరిసర వలస ఆదివాసీలంతా కలసి శనివారం వేడుక జరుపుకున్నారు. సంప్రదాయ పద్ధతిలో పసుపు రంగు టవల్స్ ధరించి జరుపుకున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవవేడుక అలరించింది. కార్యక్రమంలో పాల్గొన్న వలస ఆదివాసీ నాయకుడు ధన మాట్లాడారు. తామంతా ఆదివాసీలమేనని బతుకుదెరువు కోసం ఏపీకి వలస వచ్చామన్నారు. తమకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయకపోవడంతో తమ సంతతి చదువులు ఆర్థికస్థోమత లేక అర్థాంతరంగా ఆగిపోతున్నాయని ధన ఆవేదన చెందారు.కులధ్రువీకరణ పత్రాలను మంజూరు చేయాల్సిందిగా వేడుకుంటున్నామన ధన పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలైన పూజారి, పటేలు తదితరులు పాల్గొన్నారు.


ఐటీడీఏ ప్రాంగణంలో ఆదివాసీ జెండాను ఆవిష్కరిస్తున్న ఏపీవో జగన్నాధరావు, ఆదివాసీ నాయకులు


ఆదివాసీ దినోత్సవంలో చిన్నారుల నృత్యాలు


వలస గ్రామంలో ఆదివాసీలు జరుపుకుంటున్న ఆదివాసీ దినోత్సవం

రక్షాబంధ(మ్)న్

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో శనివారం రాఖీ పండుగ వేడుకలు వైభవంగా జరిగాయి. ఆ అందమైన చిత్రాలే ఇవి..


గొడారిగుంటలో ఎమ్మెల్యే నానాజీకి రాఖీ కడుతున్న మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి


మలికిపురంలో ఎమ్మెల్యే వరప్రసాద్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీ


రామచంద్రపురంలో మంత్రి సుభాష్‌కు రాఖీ కడుతున్న దివ్యాంగురాలు


రాజమహేంద్రవరంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు రాఖీ కట్టిన మహిళలు


అనపర్తిలో తమ్ముడిపై అక్కల ఆప్యాయత


బిక్కవోలులో చిన్నారుల సెలబ్రేషన్


కపిలేశ్వరపురంలో అన్నయ్యకు చెల్లి రాఖీ


చింతూరులో వీరజవాన్ విగ్రహానికి రాఖీ కడుతున్న యువతి


అంబాజీపేటలో సోదరుడికి రాఖీలు కడుతున్న మహిళలు

ఉపాధికి బయలుదేరి.. ఊపిరి వదిలి!

లారీ ఢీకొని ఇద్దరు నర్సరీ కూలీలు మృతి

కొవ్వూరు మండలం సీతంపేటలో ఘటన

కొవ్వూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని ఇద్దరు నర్సరీ కూలీలు మృతిచెందినట్టు కొవ్వూరు రూరల్ ఎస్‌ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. వివరాల ప్రకారం... తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం కానూరు అగ్రహారంకు చెందిన 10 మంది 5 మోటారుసైకిళ్లపై ప్రతిరోజు మాదిరిగా శనివారం ఉదయం కడియపులంక నర్సరీ పనికి బైక్‌పై బయలుదేరారు. కొవ్వూరు మండలం సీతంపేట గ్రామంలోని రంగాబొమ్మ సెంటర్ (విజ్జేశ్వరం సెంటర్) చేరుకునేసరికి వెనుక నుంచి వస్తున్న టిప్పరు లారీ ఒక బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో లంకే దుర్గాప్రసాద్ (26), దవులూరి సుబ్రహ్మణ్యం (42) బైక్ పై నుంచి కిందపడి గాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న కొవ్వూరు రూరల్ ఎస్‌ఐ శ్రీహరిరావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. ప్రమాదానికి కారణమైన లారీ విజ్జేశ్వరానికి చెందిన గోడి వెంకటేశ్వరరావుదిగా గుర్తించారు. నిడదవోలు మండలం గోపవరానికి చెందిన లారీ డ్రైవర్ కోమలి స్వామి, లారీని పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.


దవులూరి సుబ్రహ్మణ్యం, లంకే దుర్గాప్రసాద్ మృతదేహాలు


ప్రమాదానికి కారణమైన లారీ

కానూరు అగ్రహారంలో విషాదఛాయలు

పెరవలి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): లంకే దుర్గాప్రసాద్, దవులూరి సుబ్రహ్మణ్యం మృతిచెందడంతో స్వగ్రామం కానూరు అగ్రహారంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మరో 2 రోజుల్లో దుర్గాప్రసాద్ పెళ్లిచూపులు జరగనున్నాయి.

మంత్రి సంతాపం

సీతంపేటలో లారీ ఢీకొని ఇద్దరు నర్సరీ కూలీలు మృతిచెందడంపై రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ సంతాపం తెలియజేశారు. సమాచారం తెలిసిన వెంటనే కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. పోలీసులను ఆరా తీశారు. తక్షణసాయం కింద మృతుల కుటుంబాలకు రూ.10 వేల చొప్పున వ్యక్తిగతంగా ఆర్థికసాయం అందజేశారు. ప్రభుత్వం తరపున మృతుల కుటుంబాలకు సాయం అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.


బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందజేస్తున్న మంత్రి దుర్గేష్

గ్యాస్ ఏజెన్సీలో చోరీ

నిడదవోలు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు పట్టణంలోని విజయదుర్గ గ్యాస్ ఏజెన్సీలో శుక్రవారం రాత్రి దొంగలుపడ్డారు. అంతకు ముందు రోజు వరకు భారీ మొత్తంలో నగదు ఉందని శుక్రవారమే గ్యాస్ ఏజెన్సీ యజమానులు నగదు తీసుకుని వెళ్లిపోయినట్టు సమాచారం. దీంతో కొద్ది మొత్తంలో మాత్రమే నగదు చోరీ అయినట్టు సమాచారం. గ్యాస్ ఏజెన్సీలో జరిగిన దొంగతనంపై పోలీసులు క్లూస్ టీమ్‌ను రప్పించి వేలిముద్రలు సేకరించారు. ఈ సంఘటనపై పట్టణ ఎస్‌ఐ జగన్మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


దర్యాప్తు చేస్తున్న పోలీసులు

నిడదవోలు విజయదుర్గ గ్యాస్ ఏజెన్సీలో వేలిముద్రలు సేకరిస్తున్న పోలీసులు

దారిదోపిడీ దొంగలు దొరికారు

చెందుర్తి చోరీ కేసులో ఐదుగురి అరెస్ట్

- 12.5 కిలోల వెండి, 51 గ్రాముల బంగారం స్వాధీనం
- పెద్దాపురం బంగారం షాపు నిర్వాహకుడే ప్రధాన సూత్రధారుడు
- గుమస్తా, స్నేహితులే నిందితులు


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు


స్వాధీనం చేసుకున్న వెండి, బంగారం

గొల్లప్రోలు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో సంచలనం కలిగించిన దారిదోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. ఐదుగురు నిందితులను అరెస్టు చేసి చోరీకి గురైన వెండి, బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. బంగారు దుకాణం దారుడే ఈ దోపిడీకి సూత్రధారి అని గుర్తించారు. గొల్లప్రోలు పోలీసుస్టేషన్‌లో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సర్కిల్ ఎస్‌ఐలతో కలిసి పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ ఈ వివరాలను వెల్లడించారు.

అసలేం జరిగింది?

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన సమీర్ ప్రజాపత్ బాలాజీ సిల్వర్ షాపులో గుమస్తాగా పనిచేస్తూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని బంగారు దుకాణాలకు బంగారం, వెండి వస్తువులు సరఫరా చేయడంతో పాటు ఆర్డర్లు తీసుకుంటూ ఉంటున్నాడు. జూలై 28న రాజమహేంద్రవరం నుంచి బయలుదేరి పెద్దాపురం, పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాల్లో నగల దుకాణాల నుంచి బంగారం, వెండి, నగదు తీసుకుని మోటార్‌సైకిల్‌పై చెందుర్తి సెంటర్ మీదుగా వెళ్తుండగా మార్గంమధ్యలో కల్వర్టు దగ్గర నలుగురు ఆగంతకులు వచ్చి బెదిరించి అతడి వద్ద ఉన్న 12.5కిలోల వెండి, 51 గ్రాముల బంగారం, రూ.60వేల నగదు అపహరించుకుని పరారయ్యారు. దీనిపై ప్రజాపత్ ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు ఎస్‌ఐ రామకృష్ణ కేసు నమోదు చేశారు. దారిదోపిడీ ఘటనపై కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు కాకినాడ ఏఎస్పీ పర్యవేక్షణలో పిఠాపురం సీఐ శ్రీనివాస్, సర్కిల్ నలుగురు ఎస్‌ఐల ఆధ్వర్యంలో 5 దర్యాప్తు బృందాలు ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరం నుంచి చెందుర్తి సెంటర్ వరకూ గల సీసీ ఫుటేజీలు సేకరించడంతో పాటు సెల్‌టవర్ల ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి దర్యాప్తు సాగించారు. దీని ఆధారంగా నిందితులను గుర్తించారు. పిఠాపురం మండలం జల్లూరు వద్ద పెద్దాపురం పట్టణానికి చెందిన రౌతు గోవిందు, గనిరెడ్డి సాయిప్రసాద్, కోన సాయిబాబు, బొమ్మను విజయ్ ఆనంద్, కుక్కల శివమణికంఠను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.18.50 లక్షల విలువైన 12.5కిలోల వెండి, 51 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. 2 మోటార్‌సైకిళ్లు, ఐదు సెల్‌ఫోన్లు సీజ్ చేశారు. సమావేశంలో గొల్లప్రోలు, పిఠాపురం పట్టణ, రూరల్ ఎస్‌ఐలు ఎన్.రామకృష్ణ, మణికుమార్, జానీబాషా ఉన్నారు.

ఫాలో చేసి ప్లాన్..

దారిదోపిడీకి పాల్పడిన నిందితుల్లో ప్రధాన నిందితుడైన రౌతు గోవిందుకు పెద్దాపురం పట్టణంలో నగల దుకాణం ఉంది. ఇదే దుకాణంలో పని చేస్తున్న గనిరెడ్డి సాయిప్రసాద్, అతడి స్నేహితులతో కలిసి ప్రజాపత్‌పై కొంతకాలంగా నిఘా ఉంచారు. అతడు బంగారు దుకాణాల వద్ద ఆర్డర్లు తీసుకున్న తర్వాత భారీగా వెండి, బంగారం ఉంటుందని భావించి దోపిడీకి ప్లాన్ చేశా రు. కొంత కాలంగా ప్రజాపత్‌ను అనుసరిస్తూ ఆ నుపానులు తెలుసుకున్నారు. బంగారం, వెండి దొరుకుతుందని భావించి దోపిడీకి ప్లాన్ చేశారు. జూలై 28న ఒంటరిగా రావడంతో ప్లాన్ అమలు పరిచారు. అయితే వారి సెల్‌సిగ్నల్స్, సీసీ ఫుటేజీలతో బండారం బయటపడింది. బంగారు దు కాణందారుడే ఈ దోపిడీకి సూత్రధారి అని తెలియడంతో నగల దుకాణదారులు ఆశ్చర్యానికి గురయ్యారు.

ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీ

ఇద్దరి మృతి

గోపాలపురం మండలం

వెంకటాయపాలెం శివారున ప్రమాదం

గోపాలపురం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. ఈ ఘటనలో చెల్లితో రాఖీ కట్టించుకుని తిరిగి ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యంలో యువకుడు, వివాహ వేడుకకు హాజరై తిరిగి ఇంటికివస్తున్న వ్యక్తి మృతిచెందారు. వివరాల్లోకి వెళ్తే.. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం వాదాలకుంట గ్రామానికి చెందిన మరపట్ల సువర్ణరాజు (56) తాళ్లపూడి మండలం పెద్దేవం గ్రామంలో జరిగే తమ బంధువుల వివాహ వేడుకలో పాల్గొని తిరిగి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి తిరిగి వస్తున్నాడు. ఇదే క్రమంలో తాళ్లపూడి మండలం పెద్దేవం గ్రామానికి చెందిన గండేపల్లి మణిశంకర్ (30) రాఖీ పండుగ సందర్భంగా దేవరపల్లి మండలం యాదవోలులో ఉన్న తన చెల్లితో రాఖీ కట్టించుకుని తిరిగి స్వగ్రామమైన పెద్దేవం వెళ్తుండగా మార్గమధ్యంలో వెంకటాయపాలెం శివారులో ఇరువైపు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మణిశంకర్ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రగాయాల పాలైన సువర్ణరాజును హుటాహుటిన రాజమండ్రి ఆసుపత్రికి తరలించినప్పటికీ ఫలితం దక్కలేదు. అయితే మణిశంకర్ వార్త తెలిసి అతడి తండ్రి శ్రీనివాస్ (54) గుండె ఆగి కన్నుమూయడం బాధాకరం.


వెంకటాయపాలెం శివారున ప్రమాద దృశ్యం

భక్తులతో పోటెత్తిన రత్నగిరి

సత్యదేవుడి ఆలయానికి రూ.45 లక్షల ఆదాయం


తిరుచ్చివాహనంపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

అన్నవరం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వరుస సెలవుదినాలు కావడంతో సత్యదేవుడి ఆలయం భక్తులతో పోటెత్తింది. దీనికితోడు శుక్రవారం రాత్రి రత్నగిరిపై వివాహం చేసుకున్న జంటలతో పాటుగా వివిధ ప్రాంతాల్లో ఒక్కటైన నూతన జంటలు స్వామివారి వ్రతాలాచరించుకున్నారు. శనివారం 4200 వ్రతాలు జరగగా వివిధ విభాగాల ద్వారా సుమారు రూ.45 లక్షల ఆదాయం లభించింది. ఒక దశలో భక్తుల తాకిడి అధికంగా ఉండడంతో అంత్రాలయ దర్శనాలు నిలుపుదల చేసి శీఘ్రదర్శనానికి అనుమతించారు. స్వామివారి ప్రత్యేక దర్శనానికి 2గంటలు, ఉచిత దర్శనానికి 3 గంటల సమయం భక్తులు వేచి ఉండాల్సి వచ్చింది. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఈవో సుబ్బారావు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ సూచనలిచ్చారు.

వేడుకగా తిరుచ్చిసేవ

రత్నగిరివాసుడైన సత్యదేవుడికి శనివారం తిరుచ్చిసేవ వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి, అమ్మవార్లను ప్రధానాలయం నుంచి మేళతాళాలతో తూర్పురాజగోపురం వద్దకు తోడ్కొనివచ్చారు. ప్రత్యేక పూజలు అనంతరం పండితుల మంత్రోచ్ఛరణలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమ ముమ్మారు తూర్పురాజగోపురం చుట్టూ ప్రదక్షిణ గావించారు.

రాజరాజేశ్వరీగా రత్నగిరి వనదుర్గ

ముగిసిన శ్రావణ మాసోత్సవాలు

అన్నవరం, ఆగస్టు 9 (అన్నవరం): రత్నగిరి క్షేత్రరక్షకి వనదుర్గ ఆలయంలో శ్రావణ మాసోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. చివరిరోజున అమ్మవారు రాజరాజేశ్వరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. చివరిరోజున అమ్మవారికి పూర్ణాహుతి గావించారు. చతుర్వేద పండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలందజేశారు. ఈవో వీర్ల సుబ్బారావు దంపతులు పాల్గొన్నారు. పౌర్ణమి పర్వదినం పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యంగిర హోమం నిర్వహించారు.


రాజరాజేశ్వరీగా దర్శనమిస్తున్న వనదుర్గమ్మ

పామాయిల్ తోటలోకి దూసుకుపోయిన కంటైనర్

చెట్టును ఢీకొని డ్రైవర్ మృతి

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి చెంతనే ఉన్న పామాయిల్ తోటలోకి కంటైనర్ లారీ దూసుకుపోయిన సంఘటనలో డ్రైవర్ దుర్మరణం చెందాడు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నుంచి విశాఖపట్టణం వెళ్తున్న కంటైనర్ లారీ గొల్లప్రోలు మండలం చెందుర్తి శివారు కొత్త వజ్రకూటం వద్ద 16వ జాతీయ రహదారిపై అదుపు తప్పింది. రోడ్డుపక్కనే ఉన్న పామాయిల్ తోటలోకి దూసుకుపోయి గానుగచెట్టును ఢీకొంది. ఆ సమయంలో లారీ అతివేగంగా వెళ్లడంతో పూర్తిగా దెబ్బతింది. ప్రమాదంలో విజయవాడకు చెందిన లారీ డ్రైవర్ తుమ్మలగుంట శ్రీనివాసరావు(53) అక్కడికక్కడే మరణించాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. గొల్లప్రోలు ఎస్‌ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


గొల్లప్రోలు మండలం వజ్రకూటం సమీపంలో చెట్టును ఢీకొన్న కంటైనర్


మరణించిన డ్రైవర్

లోన్ యాప్స్‌లో డబ్బులు తీసుకుని... బెట్టింగ్ యాప్స్‌లో పోగొట్టి..

పురుగుల మందు తాగి యువకుడి మృతి

ఎటపాక, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ లోన్ యాప్స్‌లో డబ్బులు తీసుకుని బెట్టింగ్ యాప్స్‌లో పోగొట్టిన ఆర్థిక ఇబ్బందులతో యువకుడు మృతిచెందిన ఘటన అల్లూరి జిల్లా ఎటపాక మండలం కన్నాయిగూడెం పంచాయతీలోని సీతంపేట గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతంపేట గ్రామానికి చెందిన షేక్ సాయి (26) గత 4నెలలుగా ఆన్‌లైన్‌లోని పలు రకాల లోన్ యాప్స్ ద్వారా సుమారు రూ.4 లక్షల వరకు లోన్ తీసుకున్నాడు. అయితే సొమ్ములను పలు రకాల బెట్టింగ్ యాప్స్‌లో పెట్టడంతో పోగొట్టుకుని ఆర్థికంగా నష్టపోయాడు. ఈ నేపథ్యంలో లోన్‌యాప్స్‌ల నిర్వాహకుల నుంచి ఈ ఎంఐలు చెల్లించాలంటూ తరచూ వేధింపులకు పాల్పడడంతో మానసికంగా కుంగిపోయాడు. ఈనెల 5న పురుగుల మందుతాగాడు. కుటుంబ సభ్యులు భద్రాచలంలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. చికిత్సపొందుతూ శనివారం మృతిచెందాడు. కాగా సాయి జనసేన పార్టీలో చురుగ్గా పనిచేస్తున్నాడు. సాయి మృతిపై తల్లి షేక్ ఇందిర ఫిర్యాదుతో ఇన్‌చార్జి ఎస్‌ఐ సంతోష్‌కుమార్ కేసు నమోదు చేశారు.


సాయి (ఫైల్)

పరుపుల కంపెనీలో అగ్నిప్రమాదం

రూ.40 లక్షల ఆస్తినష్టం

మండపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం మారేడుబాకలో శనివారం పరుపుల కంపెనీలో అగ్నిప్రమాదం సంభవించింది. అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. మారేడుబాకలో లలితాదేవి ఇండస్ట్రీస్ పరుపుల కంపెనీలో శనివారం అగ్ని ప్రమాదం జరిగిందని ఫైర్ సిబ్బంది సమాచారం అందింది. దీంతో సంఘటనా స్థలానికి మండపేట ఫైర్ సిబ్బంది, రామచంద్రపురం ఫైర్ సిబ్బంది వెళ్లి రెండు ఇంజన్లతో సాయంతో మంటలను అదుపు చేశామని మండపేట ఫైర్‌స్టేషన్ ఇన్‌చార్జి అప్పారావు తెలిపారు. ఆస్తినష్టం రూ.40 లక్షల వరకు ఉంటుందని అంచనా వేశామని చెప్పారు. కాగా తమ సంస్థలో తయారు చేసే ముడిసరుకు మిషనరీ అగ్నికి కాలిబూడిదైందని, ఇటీవల బ్యాంకులో తీసుకున్న రుణం చెల్లించామని, కంపెనీకి ఇన్సురెన్స్ కూడా లేదని తమకు తీవ్ర నష్టం కలిగిందని నిర్వాహకుడు వాపోయాడు.


మారేడుబాకలో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

'శ్రీప్రకాష్'లో ఖోఖో పోటీలు

తునిరూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని శ్రీప్రకాష్ స్కూల్‌లో అంతర్ రాష్ట్ర ఖోఖో పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. క్లస్టర్-7(ఆంధ్రా, తెలంగాణ) అండర్ -14, 17, 19 బాలుర, బాలికల విభాగంలో 180 టీమ్‌లు, 2వేలమందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. పోటీలను శ్రీప్రకాష్ విద్యాసంస్థల అధినేత నరసింహరావు ప్రారంభించి క్రీడాకారులను పలకరించారు. ఈ పోటీలు 3 రోజుల పాటు జరుగుతాయని విద్యాసంస్థ సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపల్ ఎంవీవీఎస్ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ అపర్ణ, ఖోఖో ఫెడరేషన్ సెక్రటరీ సీహెచ్ఎల్ఎం శ్రీని వాస్ తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులను పలకరిస్తున్న నరసింహారావు

చెవిదిద్దులు బాగున్నాయని చెప్పి..

వృద్ధురాలి బంగారపు చెవిదిద్దులతో వ్యక్తి పరారీ

కొవ్వూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలి బంగారపు చెవిదిద్దులు దొంగిలించుకుపోయిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి తెలిపారు. వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం చిట్యాల గ్రామానికి చెందిన ఊనగట్ల పుట్టాలమ్మ (70) మూడు రోజుల క్రితం కొవ్వూరు మండలం వాడపల్లిలో అక్క ఇంటికి వచ్చింది. శనివారం ఇంటికి తిరిగి పయనమైంది. వాడపల్లి సెంటర్‌లో గుర్తుతెలియని వ్యక్తిని లిఫ్టు అడిగి బండి ఎక్కింది. కొవ్వూరు పట్టణంలోని గోదావరి గట్టుపై ఉన్న గ్రామదేవత కొవ్వూరమ్మ ఆలయం వద్దకు చేరుకునేసరికి ఆ వ్యక్తి బండి ఆపి మీ చెవిదిద్దులు బాగున్నాయి...మా అమ్మకు చేయిద్దామనుకుంటున్నాను ఒకసారి ఇస్తారా అని అడిగాడు. పుట్టాలమ్మ 3 గ్రాముల చెవిదిద్దులు తీసి ఇవ్వగా ఆ వ్యక్తి అక్కడ నుంచి పరారయ్యాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పుట్టాలమ్మ అందించిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు హెడ్‌కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి తెలిపారు.

నేడు తాండవ రిజర్వాయర్ నీరు విడుదల

కోటనందూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): తాండవ రిజర్వాయర్ నీటిని ఆదివారం విడుదల చేస్తామని రిజర్వాయర్ డీఈ అనురాధ తెలిపారు. ఇటీవల తాండవ కార్యాలయంలో సమావేశం జరిగింది. నారుమడులు ఎండిపోతున్న దృష్ట్యా నీటిని ఈనెల 10లోపు విడుదల చేయాలని నీటిసంఘం అధ్యక్షులు కోరడంతో విడుదల చేస్తున్నామన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 371 అడుగుల నీటిమట్టం ఉందన్నారు. ఈ రిజర్వాయర్ కాకినాడ, అనకాపల్లి జిల్లా లకు కేంద్రంగా ఉండడంతో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, హోంమంత్రి అనిత, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ వస్తున్నారని చైర్మెన్ కరక సత్యనారాయణ తెలిపారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు

అల్లవరం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): బోడసకుర్రు గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లిపాలెంలో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, నగేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోహిణీ తల్లీ పిల్లల ఆసుపత్రి వైద్యులు చిన్న పిల్లలకు అన్నిరకముల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

జనార్దనస్వామికి పూజలు

ఆలమూరు,ఆగస్టు9(ఆంధ్రజ్యోతి):శ్రావణమాసం శనివారంతో పాటు శ్రవణ నక్షత్రం సందర్భంగా ఆలమూరులో వేంచేసియున్న శ్రీదేవిభూదేవి సమేత నవజనార్దనస్వామికి మారేడు దళాలతో ప్రత్యేకపూజను నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు ఖండవల్లి ప్రభాకరాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి ముందుగా అభిషేకాలు నిర్వహించారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు అనధికార లైన్లు

● విద్యుత్, రెవెన్యూ శాఖల నిర్లక్ష్యంతో పొంచి ఉన్న ప్రమాదాలు




ఓడలరేవు తీరంలో ఆక్వా చెరువుల వద్ద ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్, భూమిపై విద్యుత్ తీగలు

అల్లవరం ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): సముద్ర తీర ప్రాంతం అల్లవరం మండలం ఓడలరేవు, కొమరగిరిపట్నం తీరం సీఆర్‌జడ్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా తవ్విన అక్రమ ఆక్వా చెరువుల వద్ద అక్రమ విద్యుత్ లైన్లతో ప్రమాదం పొంచి ఉంది. విద్యుత్, రెవెన్యూ, మత్స్యశాఖల నిర్లక్ష్యంతో తవ్విన చెరువుల వద్ద ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. సముద్ర తీరంలో ఆక్వా చెరువులకు అనుమతులు ఇచ్చి రెవెన్యూ, మత్స్యశాఖలు విద్యుత్‌లైన్లకు ట్రాన్స్‌ఫార్మర్లు వేసి విద్యుత్‌శాఖలో పెద్ద తప్పునే చేశాయి. ప్రభుత్వ శాఖల అలసత్వ వైఖరితో సముద్రతీరం, వైనతేయ నదీతీరం వెంబడి, సీఆర్‌జడ్ పరిధిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. ఈట్రాన్స్‌ఫార్మర్ల నుంచి మరికొందరు దూరప్రాంత ఆక్వా రైతులకు నిబంధనలకు విరుద్ధంగా నెలవారీ అద్దెపై చెరువులకు విద్యుత్ సరఫరా చేస్తున్నారు. చూసీచూడనట్టు వ్యవహరించే విద్యుత్‌శాఖకు నెలవారీ ముడుపులు ముడుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. తీరంలోని సీఆర్‌జడ్ పరిధిలో వందలాది ఎకరాల్లో అక్రమ ఆక్వా చెరువులు తవ్వి సాగు చేస్తుండగా దొడ్డిదారిన విద్యుత్ లైన్లు ఇచ్చిన ఆ శాఖకు కాసుల పంట పండుతోంది. విద్యుత్‌శాఖ అండతో తీరంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటులోనే భారీ అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న చోటుకు 2కిలోమీటర్ల నుంచి 3కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆక్వా చెరువులకు నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ సరఫరా చేస్తున్నారు. సిబ్బంది అండతో విద్యుత్ చౌర్యం జోరుగా సాగుతున్నా విజిలెన్స్‌శాఖ పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి ఆక్వా చెరువులకు రెండేసి కిలోమీటర్ల దూరంలో ఉన్న చెరువులకు వెళ్లిన విద్యుత్ లైన్లు నేలమీద పడేసి, కొన్ని పక్కనున్న తాటి మొక్కల మీదుగా ప్రమాద భరితమైన విద్యుత్ సరఫరా జరుగుతుంది. ఏ క్షణాన ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యుత్, రెవెన్యూశాఖలు పట్టించుకోవడంలేదని విమర్శిస్తున్నారు. ప్రమాదకరమైన ఈవిద్యుత్ తీగలను మనుషులు గానీ, పశువులు గానీ తాకితే ప్రాణాపాయం తప్పదంటున్నారు. ఓడలరేవు ఓఎన్జీసీ ప్లాంటు సమీపాన ఇటీవల, గతంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి వెళ్లిన లైన్ల వద్ద విద్యుత్ మంటలు చెలరేగాయి. ఓఎన్జీసీ, ఫైర్ సిబ్బంది, సకాలంలో వచ్చి మంటలు ఆర్పివేశారు. అక్రమ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద, విద్యుత్ లైన్ల వద్ద ప్రమాదాలు జరగకుండా జిల్లాస్థాయి అధికారులతో దర్యాప్తు చేయించాలని జిల్లా కలెక్టర్‌కు పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. విజిలెన్స్ అధికారులు, విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు వీటిపై దర్యాప్తు చేయాలని లేకుంటే ప్రమాదాలు జరిగితే బాధ్యులు ఎవరని ప్రశ్నిస్తున్నారు.

ఘనంగా రాఖీపౌర్ణమి వేడుకలు





అమలాపురం: ఎమ్మెల్యే ఆనందరావుకు రాఖీ కడుతున్న టీడీపీ తెలుగు మహిళలు, పి.గన్నవరం:లంకలగన్నవరంలో అన్నకు రాఖీ కడుతున్న చెల్లె, అంబాజీపేటలో రాఖీ కడుతున్న దృశ్యం

అమలాపురం టౌన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): శ్రావణ పౌర్ణమి వేడుకలను అమలాపురంలో శనివారం ఘనంగా నిర్వహించారు. సోదరిలు సోదరులకు రక్ష కట్టి ఆనందాలను పంచుకున్నారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుకు తెలుగు మహిళలు రాఖీ కట్టి వేడుకలు జరిపారు. తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, టీడీపీ నియోజకవర్గ అధ్యక్షురాలు గెల్లా మీనాకుమారి, పేరూరి విజయలక్ష్మి, గెద్దాడ సత్యవాణి, అప్పారి సుశీల, పోతుల నాగలక్ష్మి, జల్లి ప్రసన్నవాణి, యనమదల లక్ష్మి, సుమతి ఉన్నారు. అలాగే ఎమ్మెల్యేకు బ్రహ్మకుమారి బీకే స్వరూప శుభాకంక్షలు తెలిపారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి):అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రక్షాబంధన్ వేడుకలను పలుచోట్ల ఘనంగా జరుపుకున్నారు. సోదరులకు సోదరిలు రక్షాబంధన్ కట్టి రాఖీ శుభాకాంక్షలు తెలిపారు. సోదరీమణులకు సోదరులు రక్షాబంధన్ సందర్భంగా కానుకలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ముమ్మిడివరం కొత్తకాలనీ, మత్స్యకార కాలనీలో సమరసత సేవా ఫౌండేషన్ కన్వీనర్ పంతాడి సూర్యనారాయణ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ధార్మికసమితి సభ్యులు, మాతృమూర్తులు, విద్యార్థులు పాల్గొన్నారు. ధర్మప్రచారక్ కనకారావు మాట్లాడుతూ రక్షాబంధన్ విశిష్టతను వివరించారు. పంతాడి సావిత్రి, బలశాడి నాగవేణి, బలశాడి మంగాదేవి, రమ్య, పంతాడి సుజాత, పంతాడి గంగావీరవేణి, పంతాడి సత్యనారాయణ, పంతాడి రాంబాబు, పంతాడి వెంకటసత్యనారాయణ పాల్గొన్నారు.

మలికిపురం, (ఆంధ్రజ్యోతి): శ్రావణ పౌర్ణమి సందర్భంగా మండలంలో రాఖీ పండుగ ఘనంగా జరుపుకున్నారు. పలుచోట్ల సోదరులకు సోదరీమణుల రాఖీలు కట్టి తమ మధ్య బంధాన్ని మరింత పదిలం చేసుకున్నారు. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు బ్రహ్మకుమారీలు రక్ష కట్టారు.



అంతర్వేదిలో తమ్ముడికి రాఖీ కడుతున్న అక్క

ఈసందర్భంగా ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, కూటమిపాలనలో అందరికీ మంచి జరుగుతుందన్నారు. శ్రావణపౌర్ణమిని పురస్కరించుకుని దేవాంగ సామాజిక వర్గీయులు పలుచోట్ల చౌడేశ్వరిదేవి కల్యాణాలు నిర్వహించి అన్నదానాలు చేశారు. దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

రాజోలు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో రక్షా బంధన్ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. అక్కాతమ్ముళ్లు, అన్నా చెల్లెళ్లు రాఖీలు కట్టుకుని మిఠాయిలు పంచుకుని తమ మధ్య ఆప్యాయతలను చాటుకున్నారు. పాలగుమ్మిలో నేను నీకు రక్షా, మీరు నాకు రక్షా.. మనమంతా కలిసి ఈదేశానికి రక్ష అని ప్రజలు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): అన్నచెల్లలు, అక్కా తమ్ముళ్ల బంధానికి ప్రతీక రాఖీ పౌర్ణమిని వాడవాడలా శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. తమ్ముళ్లకు అక్క, అన్నయ్యలకు చెల్లెలు రాఖీలు కట్టి తన బంధాన్ని చాటుకున్నారు. అనంతరం రాఖీకట్టిన వారికి బహుమతులు అందజేశారు. ఆలయాలు కిటకిటలాడాయి.

కాట్రేనికోన, (ఆంధ్రజ్యోతి): అన్నాచెల్లెళ్ల పవిత్ర అనుబంధానికి గుర్తుగా రాఖీ పండుగను మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఘనంగా జరుపుకున్నారు. కొందరు సోదరులు తమ సోదరీమణుల ఇంటికి వెళ్లి రాఖీ కట్టించుకున్నారు. మరికొందరు సోదరీమణులు పుట్టింటికి వచ్చి సోదరులకు రాఖీలు కట్టారు. మరికొందరు తమ స్వంతవారు కాకపోయినా కొందరిని సోదరులుగా భావించి మహిళలు రాఖీలు కట్టించుకున్నారు. ఈఏడాది రాఖీ పర్వదినం ప్రత్యేకం కావడంతో పలు శుభకార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. 95ఏళ్లఅనంతరం అప్పటి గ్రహ సంచారం ప్రస్తుతం శ్రావణపూర్ణిమ నాడు సంభవించినట్టు పండితులు చెప్పడంతో ఈఏడాది రాఖీ పండుగ ప్రత్యేకతను సంతరించుకుంది.

పి.గన్నవరం,(ఆంధ్రజ్యోతి): రాఖీపౌర్ణమి పర్వదినం పురస్కరించుకుని గ్రామాల్లో అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అక్క, చెల్లెళ్లు తమ అన్నదమ్ములకు రాఖీ కట్టి స్వీట్లు తినిపించారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నా చెల్లెళ్లు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు పలువురు మహిళలు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

ఐ.పోలవరం, (ఆంధ్రజ్యోతి): రక్షాబంధన్‌ను శనివారం ప్రేమానురాగాలతో జరుపుకున్నారు. ఎక్కడో ఇతర ప్రాంతాల్లో ఉంటున్న సోదరీమణులు పుట్టింటికి వచ్చి అన్నదమ్ములకు రాఖీ కట్టి ప్రేమానుబంధాలు నిరూపించుకున్నారు.

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): అనుబంధాలు ఆప్యాయతలను కాపాడుకునేందుకు, ఆచార సంప్రదాయాలను నిలబెట్టేలా రక్షాబంధన్‌లు కడుతూ తీయని ఆనందాన్ని కుటుంబాల మధ్య జరుపుకునే పెద్ద పండుగ రక్షాబంధన్. అంతర్వేది దేవస్థానం, గొంది, రామేశ్వరం, సఖినేటిపల్లి, వీవీమెరక, మోరి,మోరిపోడు, కేశవదాసుపాలెం గ్రామాల్లో రాఖీపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రావణ పౌర్ణమి కావడంతో అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చేరుకునే రోడ్డుమార్గాలు భక్తులతో కిక్కిరిశాయి. స్వామివారి దర్శనానికి భక్తులుబారులు తీరారు.





ముమ్మిడివరం: రాఖీ కట్టి వేడుకలు జరుపుకుంటున్న మహిళలు, ఐ.పోలవరం: రాఖీ కడుతున్న చెల్లెళ్లు, అమలాపురంలో అన్నయ్యకు రాఖీ కడుతున్న చెల్లె

మలికిపురం మార్కెట్ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తా



మలికిపురం మార్కెట్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రాజోలు ఎమ్మెల్యే దేవ

మలికిపురం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మలికిపురం ఆదివారం సంతమార్కెట్ ప్రాంతాన్ని ఆధునికీకరించి అన్ని సౌకర్యాలు ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శనివారం మార్కెట్ ప్రాంతాన్ని పరిశీలించి దేవ మాట్లాడుతూ రెండు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈమార్కెట్ ప్రాంతంలో ప్రతీ అంగుళాన్ని సద్వినియోగం చేసుకుంటే భవిష్యత్తు తరాలకు దిక్సూచిలా ఉంటుందన్నారు. రూ.100కోట్ల విలువైన ఈ ప్రాంతాన్ని గత పాలకులు నిర్లక్ష్యంచేశారని, ఇప్పటికే ఇది అభివృద్ధి చేయాల్సిందన్నారు. నేషనల్ హైవే రోడ్లు అభివృద్ధి చెందుతున్న ఈతరుణంలో మలికిపురం మెయిన్ రోడ్డును వెడల్పుచేసే ఆలోచన ఉందని, అప్పుడు మార్కెట్ ప్రాంతం ఆవశ్యకత ఎంతైనా ఉంటుందన్నారు. ఈప్రాంతంలో మంచి వాణిజ్య సముదాయం ఏర్పాటుతో మల్టీప్లెక్సు వంటి వాటిని ఏర్పాటుచేస్తే పంచాయతీకి ఆదాయం రావడంతో పాటు ఒకే గొడుకు కిందకు అన్ని వ్యాపారాలను తీసుకురావచ్చునన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, గెడ్డం తులసీభాస్కర్, జక్కంపూడి శ్రీదేవి, పిండి సత్యనారాయణ, బొక్కా గోవిందు, బొల్లం ప్రసాద్, కార్యదర్శి తాడి ఏసు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం



వేగివారిపాలెంలో కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం

రాజోలు, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతుందని ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం అన్నారు. వేగివారిపాలెంలో శనివారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు, ఇంటింటికీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన ప్రతీ ఇంటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి వారి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, చాగంటి స్వామి, సర్పంచ్‌లు యెనుముల నాగు, కోటిపల్లి రత్నమాల, కడలి నీటిసంఘం అధ్యక్షుడు గాలిదేవర వెంకన్నబాబు, కట్టా సూరిబాబు, అడబాల యుగంధర్, కాకి లక్ష్మణ్, పిల్లి శ్రీరామమూర్తి, మంగెన నాని, అడబాల సాయిబాబు, అనుచూరి పురుషోత్తం, యాండ్ర దొరబాబు, ఈలి శ్రీనివాస్, మామిడిశెట్టి నాగరాజు, అడబాల విజయ్, కంచి గణేశ్వరరావు, యాండ్ర స్వామి, పిల్లి ప్రకాష్, కాండ్రేగుల సత్యనారాయణ, యాండ్ర తాతాజీ పాల్గొన్నారు.

దొంగకు దేహశుద్ధి చేసిన ఈదరాడ ప్రజలు

మామిడికుదురు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఈదరాడలో దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని పట్టుకుని దేహశుద్ధి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన కొబ్బరికాయల వ్యాపారి లంకలపల్లి సత్యనారాయణ వైద్య పరీక్షల కోసం ఇంటికి తాళం వేసి భార్యతో కలిసి హైదరాబాద్ వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేరని తెలుసుకున్న పశ్చిమగోదావరి జిల్లా పెనుమంచిలి చెందిన మార్గాని గోపాలకృష్ణ ఈనెల3న దొంగతనానికి పాల్పడ్డాడు. పారిపోయే ప్రయత్నంలో అతడిని గ్రామస్తులకు పట్టుబడడంతో స్థానికులు దేహశుద్ధిచేసి నగరం పోలీసులకు అప్పగించారు. అతడి వద్ద నుంచి రూ.7వేల నగదును పోలీసులకు స్వాధీనం చేసుకున్నారు. బాధితుడి అల్లుడు యెరుబండి గోవింద విజయరామమూర్తి ఫిర్యాదుపై ఈనెల4న కేసు నమోదు చేశామని నగరం ఎస్‌ఐ ఎ.చైతన్య కుమార్ తెలిపారు. నిందితుడికి రాజోలు కోర్టు రిమాండు విధించిందన్నారు.

మందేశ్వరస్వామికి పూజలు

కొత్తపేట,ఆగస్టు9(ఆంధ్రజ్యోతి):మందపల్లి శనేశ్వర(మందేశ్వర) స్వామివారి ఆలయానికి శనివారం శ్రావణ మాసం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనములకు తైలాభిషేకాలకు క్యూకట్టారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏపీ సీఐడీ డీజీపీ రవిశంకర్‌అయ్యర్, విశాఖపట్నం కోస్టల్ సెక్యూరిటీ అడిషనల్ ఎస్పీ మధుసూధనరావులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.1,46,393 ఆదాయం వచ్చినట్లు ఈవో దారపురెడ్డి సురేష్‌బాబు తెలిపారు.

ఘనంగా హయగ్రీవ జయంతి



మామిడికుదురులో హయగ్రీవ జయంతి నిర్వహిస్తున్న అర్చకులు

మామిడికుదురు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మామిడికుదురులోని శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీలక్ష్మీహయగ్రీవ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, పంచామృతాలతో స్వామివారికి అభిషేకం శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి పెన్నులను విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమాలు సుదర్శనం వెంకటసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బీవీసీ కళాశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



బీటెక్ డిగ్రీలు ప్రదానం చేస్తున్న జేఎన్‌టీయూకే డైరెక్టర్ కృష్ణప్రసాద్, రమేష్ తదితరులు

అల్లవరం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే, అచీవర్స్ డే వేడుకలు శనివారం ఘనంగా పండుగలా జరిగాయి. అటానమస్ గుర్తింపు పొందిన బీవీసీ ఇంజనీరింగ్ విద్యార్థులు తమ విజ్ఞానాన్ని సమాజ అభివృద్ధికి ఉపయోగించాలని ముఖ్య అతిథి జేఎన్‌టీయూకే కాకినాడ డైరెక్టర్ డాక్టర్ ఎంహెచ్‌ఎం కృష్ణప్రసాద్ అన్నారు. బీవీసీవిద్యాసంస్థ విద్యాభివృద్ధిలో మంచి ఫలితాలు సాధించి ముందుందని హైదరాబాద్ హ్యూమన్ సెక్యూరిటీ స్టడీస్ ఈడీ డాక్టర్ రమేష్ కన్నెగంటి అన్నారు. సభాధ్యక్షుడు బీవీసీ కళాశాల సెక్రటరీ, బోనం కనకయ్య మాట్లాడుతూ పీహెచ్‌డీలు చేసేవిధంగా బీవీసీ కళాశాల విద్యార్థులను తీర్చిదిద్ది అత్యుత్తమ ఫలితాలు సాధించిందని, తమ విద్యార్థులు రూ.9.50లక్షలు ప్యాకేజీలతో ఉద్యోగాలు సాధించడం గర్వకారణమన్నారు. పండుగ వాతావరణంలో బీటెక్ డిగ్రీలు ప్రదానం చేశారు. వైస్‌చైర్మన్ బోనం కనకదుర్గ, చందు శ్రీనివాసరావు, బోనం కృష్ణ, బి.శ్రీనివాసరావు, డాక్టర్ కె.రాజశేఖర్, ఆకుల ఏసుప్రసాద్, జేబీజీ రామారావు, టీవీ జనార్ధనరావు, విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మోరి రోడ్డుకు మోక్షం లేదా!



మోరి రోడ్డులో గుంతలు

మలికిపురం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మలికిపురం-మోరి-కేశవదాసుపాలెం రోడ్డు మోరిలో గుంతలు పడి ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. పలుమార్లు ఆర్‌అండ్‌బీ అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టినప్పటికీ ఈ గోతుల బాధ ప్రజలకు తప్పడం లేదు. ఆర్‌అండ్‌బీ శాఖ మరమ్మతులు చేస్తున్నప్పటికీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణదారులు ఎత్తు చేయడంతో నీరు రోడ్డుపై నిలిచి రోడ్డు పాడవుతోంది. ఇప్పటికైనా అధికారులు గుర్తించి రోడ్డు పక్కన మెరక చేసిన ప్రాంతాలను తొలగిస్తే ఈ రోడ్డుకు మంచి జరుగుతుందని, ప్రయాణికుల బాధలు తప్పుతాయని ప్రజలు కోరుతున్నారు. ఆర్‌అండ్‌బీ ఏఈఈ సురేష్‌ను వివరణ కోరగా వర్షాలు తగ్గిన తరువాత మరమ్మతులు చేస్తామని తెలిపారు.

‘దళిత యువకుడిపై దాడి దారుణం’

అంబాజీపేట, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): తిరుమలలో భూమన కరుణాకర రెడ్డి కుటుంబం ఆధ్వర్యంలో జరిగిన దాడి కేవలం ఒక వ్యక్తిపై జరిగిన దౌర్జన్యం మాత్రమే కాదని ఇది దళిత సమాజాన్ని లక్ష్యంగా చేసుకుని వైసీపీ నాయకత్వం చేస్తున్న దమనకాండ అని, వైసీపీ దళిత వ్యతిరేక పార్టీ అని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొలమూరి ధర్మపాల్, ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పెదపూడి శ్రీనివాసు అన్నారు. తిరుపతిలో భూమన కరుణాకరరెడ్డి కుమారుడు అభినాయరెడ్డి కార్యాలయంలో వైసీపీ రౌడీలు ఒక నిరపరాధ దళిత యువకుడ్ని బంధించి స్పృ కోల్పోయే వరకూ కొట్టిన ఘటనను తీవ్రంగా ఖండించారు. వైసీపీ దళిత వ్యతిరేక పార్టీ అని మరో సారి రుజువైందన్నారు. దళిత సమాజం మీద ఇలాంటి దాడులను ఎవరూ సహించరని హెచ్చరించారు. జగన్మోహనరెడ్డి తక్షణమే దళితులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఘనంగా హీరో మహేష్‌బాబు జన్మదిన వేడుకలు



అంబాజీపేట: మహేష్‌బాబు పుట్టినరోజు వేడుకల్లో కేక్ తినిపిస్తున్న మంత్రి సుభాష్

అమలాపురం టౌన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మహేష్‌బాబు జన్మదిన వేడుకలను అభిమానులు శనివారం నిర్వహించారు. ఎంబీఎఫ్‌సీ ఆధ్వర్యంలో స్థానిక గడియార స్థంభం సెంటర్‌లో ఏర్పాటుచేసిన భారీ కేక్‌ను కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కట్ చేశారు. జిల్లాలో మహేష్‌బాబు అభిమానులు రక్తదాన శిబిరాలు ఏర్పాటుచేసి రక్తదానం చేశారు. పట్టణంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మహేష్‌బాబు ఫ్యాన్స్‌క్లబ్ నాయకులు సంసాని రమేష్, దొంగ శ్రీను, గంధం పల్లంరాజు పాల్గొన్నారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): మహేష్‌బాబు ఫ్యాన్స్ అధ్యక్షుడు దొమ్మేటి రవికిరణ్, ఉపాధ్యక్షుడు పితాని జయకృష్ణ, కార్యదర్శి పితాని మహేష్, జాయింట్ సెక్రటరీ వాసంశెట్టి సాయి, ఇన్‌చార్జ్ మామిడిశెట్టి నానిల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కేక్‌ను మంత్రి వాసంశెట్టి సుభాష్ కట్ చేశారు. గంధం పల్లంరాజు, వాసంశెట్టి చినబాబు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు, పితాని రాంబాబు, దొమ్మేటి శ్రీను పాల్గొన్నారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): సూపర్‌స్టార్ మహేష్‌బాబు జన్మదిన వేడుకలను అభిమానులు ముమ్మిడివరంలో ఘనంగా నిర్వహించారు. భారీ కేక్‌ను కట్‌చేసి వేడుకలు జరిపారు. మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించి భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. మహేష్‌బాబు అభిమానులంతా సంఘటితంగా పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): పోతవరంలో యువకులు మామిడిశెట్టి వినయ్, వెంకి ఆధ్వర్యంలో మహేష్‌బాబు పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. మంత్రి సుభాష్ కేక్ కట్ చేసి అభిమానులకు, నాయకులకు పంచారు.

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): మహేష్‌బాబు జన్మదిన వేడుకలను గోడిలంక భవిత కేంద్రంలో నిర్వహించారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు కేక్‌ను కట్‌చేశారు. మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కడలి పృథ్వీ ఆధ్వర్యంలో భవిత కేంద్రం వద్ద మెడికల్ క్యాంపు నిర్వహించారు.

వైభవంగా చండీహోమం



చండీ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

ఐ.పోలవరం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): శ్రావణ పూర్ణిమ సందర్భంగా మురమళ్ళ శ్రీభద్రకాళీసమేత వీరేశ్వరస్వామి ఆలయంలో శనివారం బ్రహ్మశ్రీ పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో చండీ హోమం జరిగింది. 118మంది భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ పర్యవేక్షకుడు కటారి శ్రీనివాసరాజు, ఆకొండి కిరణ్ పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామికి లక్ష తులసి పూజ



పి.గన్నవరం, ఆగస్టు9(ఆం ధ్రజ్యోతి): లంకలగన్నవరంలో వేంచేసి ఉన్న శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష తులసి పూజను వైభవంగా నిర్వ హించారు. శ్రావణ పౌర్ణమి, విఖనస జయంతిని పురస్కరించుకుని రాజోలు తాలుకా వైఖానస సంఘ సభ్యులు, స్థానిక అర్చకులు, గ్రామ స్తులు ఆధ్వ ర్యంలో పూజా కార్యక్రమం నిర్వహిం చారు. ఉదయం స్వామి వారికి ఖండ వల్లి మురళీకృష్ణాచార్యులు బ్రహ్మ త్వంలో అనంత వెంకట నారాయణాచార్యులు, అనంతాచార్యులు నేతృత్వంలో పతాకావిష్కరణ, పంచామృత అభిషేకాలు, గోపూజ, లక్ష తులసిపూజ, శాంతి కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

అభిమానుల మొక్కు తీర్చిన మంత్రి సుభాష్

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి):సుభాష్ ఎమ్మెల్యే గెలుపొందాలని అంబాజీపేటకు చెందిన యువకులు జ్యోగి చైతన్యకృష్ణ, గుత్తుల సురేష్ మొక్కుకున్నారు. ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రిగా అవ్వడంతో మాచవరం గణపతి ఆలయంలో 108 కొబ్బరికాయలను మంత్రి వాసంశెట్టి సుభాష్ కొట్టి అభిమానుల మొక్కు తీర్చారు.

కేశవస్వామి మాస కల్యాణం

ఆత్రేయపురం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): శ్రవణ నక్షత్రం, శ్రావణ మాసం సందర్భంగా పురాన ప్రసిద్ధిగాంచిన ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో శనివారం స్వామివారి మాస కల్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, నీరాజన మంత్ర పుష్పం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

‘దత్తత కుటుంబాన్ని ఆదుకుంటా’



జిల్లా రవాణాధికారికి రాఖీ కడుతున్న దుర్గాప్రసాద్ సోదరి

అంతర్వేది, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పీ-4 పథకం కింద దత్తత తీసుకున్న కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటానని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు తెలియచేశారు. అంతర్వేది పల్లిపాలేనికి చెందిన కామాడి దుర్గాప్రసాద్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా కుటుంబ సభ్యులను డీటీవో శనివారం పరామర్శించారు. దుర్గాప్రసాద్ సోదరితో రక్షాబంధన్ కట్టించుకుని ఆ కుటుంబానికి నూతన వస్త్రాలు అందించారు. ఆ కుటుంబానికి తాను అన్నివిధాలా భవిష్యత్తులో అండగా ఉంటానని ఆయన భరోసా ఇచ్చారు.

ఎంపీటీసీకి ఎమ్మెల్యే పరామర్శ

మామిడికుదురు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): భార్య వియోగంతో బాధపడుతున్న లూటుకుర్రు ఎంపీటీసీ నామన వెంకటేశ్వరరావును శనివారం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పరామర్శించారు. ఎంపీటీసీ భార్య పద్మ చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పెనుమాల లక్ష్మి, సర్పంచ్ అడబాల తాతకాపు, మాజీ జడ్పీటీసీ మద్దాల కృష్ణమూర్తి, జాలెం శ్రీనివాసరాజా, కేఎం రజా, బోనం బాబు, బళ్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మండపేట


మందపల్లి శనేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మందపల్లి ఆలయానికి పోటెత్తిన భక్తులు

కొత్తపేట, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనాలు, తైలాభిషేకాలకు బారులుతీరారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏపీ సీఐడీ డీజీపీ రవిశంకర్ అయ్యర్, విశాఖపట్నం కోస్టల్ సెక్యూరిటీ అడిషనల్ ఎస్పీ మధుసూధనరావు స్వామివారిని దర్శించుకుని పూజలు జరిపారు. వారికి స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలను అందించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.1,46,393 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్లు, ఈవో దారపురెడ్డి సురేష్‌బాబు తెలిపారు.

విజయదుర్గా పీఠంలో శ్రావణ పౌర్ణమి పూజలు

రాయవరం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): వెదురుపాక విజయదుర్గా పీఠంలో శనివారం శ్రావణ పౌర్ణమి పూజలు ఘనంగా జరిగాయి. పీఠం అడ్మినిస్ట్రేటర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వేకువజాము నుంచే అమ్మవారికి పంచ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. భవానీ శంకర అష్టలింగేశ్వరస్వామికి ఏకవార రుద్రాభిషేకాలు, శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి సుప్రభాతసేవ, తులసిదళ అర్చనలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక అలంకరణ జరిపి దుర్గ, లలితా అష్టోత్తర సహస్ర నామాలు, లక్ష్మీ, సరస్వతి అష్టోత్తరాలతో కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు సామూహిక కుంకుమార్చనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఠాధిపతి గాడ్ శ్రావణ పౌర్ణమి విశిష్టతను భక్తులకు తెలిపారు. విజయదుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్న సమారాధన జరిపారు.


ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన విజయదుర్గా అమ్మవారు

'అంబేడ్కర్ కోనసీమ జిల్లాను అలాగే కొనసాగించాలి'

కొత్తపేట, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లాను యథాతథంగా కొనసాగించాలని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి పేర్కొన్నారు. శనివారం ఆయన ఒక ప్రకటనను విడుదల చేశారు. అమలాపురం పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలతో అంబేడ్కర్ కోనసీమ జిల్లా రూపుదిద్దుకుందన్నారు. గత ప్రభుత్వ నిర్వాకం వల్ల ముమ్మిడివరం నియోజకవర్గంలో తాళ్లరేవు మండలం రామచంద్రపురం నియోజకవర్గంలో కాజులూరు మండలాన్ని కాకినాడ జిల్లాలో కలిపారన్నారు. జరిగిన పొరపాటును సరిదిద్ది అమలాపురం పార్లమెంట్ అంతటిని ఒకే జిల్లాగా పరిగణించాలన్నారు. జిల్లా నుంచి చమురు నిక్షేపాలను తరలించుకుపోతున్న ఓఎన్జీసీ ఈ ప్రాంతానికి అరకొర నిధులు ఇచ్చి చేతులు దులుపుకుంటోందన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి ఓఎన్జీసీ తోడ్పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బాబ్జి కోరారు.


టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి బాబ్జి


ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో మాసకల్యాణం..పాల్గొన్న భక్తులు

కేశవస్వామి ఆలయంలో మాస కల్యాణం

ఆత్రేయపురం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో శనివారం స్వామివారి మాస కల్యాణాన్ని నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహ వచనం, నీరాజన మంత్రపుష్పం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపారు. అందంగా అలంకరించిన వేదిక వద్దకు స్వామివారిని తోడ్కొని వచ్చి శోభాయమానంగా కల్యాణం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తజనం పాల్గొని అన్నప్రసాదంలో పాల్గొన్నారు. ఆలయ ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి వీటి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శ్రీనివాసుడికి జన్మ నక్షత్ర పూజలు

రాయవరం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రాయవరం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి జన్మనక్షత్ర పూజలను ఘనంగా నిర్వహించారు. శనివారం వేంకటేశ్వరస్వామి జన్మనక్షత్రమైన శ్రవణం పురస్కరించుకుని స్వామివారికి ఆలయ అర్చకుడు పెద్దింటి కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి తులసిదళ అర్చనలు, అమ్మవార్లకు అష్టోత్తర పూజలు, నీరాజన మంత్రపుష్పాలు, మహానివేదన జరిపి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



కనుల పండువగా జన్మ నక్షత్ర పూజలు

కపిలేశ్వరపురం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : అంగర వైభవ వెంకటేశ్వరస్వామి దివ్యక్షేత్రంలో వెంకన్న జన్మనక్షత్ర పూజలు కనుల పండువగా జరిగాయి. ఆలయ అర్చకులు కె.బాలబాలాజి ఆధ్వర్యంలో పలువురు పండితులు స్వామివారికి అభిషేకాలు, విశేష పూజలు, స్వామివారి శ్రవణా నక్షత్ర పూజలు వేదమంత్రాల మధ్య నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. భక్తుల మనోభీష్టాలు నెరవేరేందుకు వారితో ముడుపులు కట్టించి 7 ప్రదక్షిణలు చేయించి కట్టిన ముడుపును స్వామివారికి సమర్పించినట్లు ఆలయ అర్చకులు బాలబాలాజి ఆచార్యులు తెలిపారు. ఆలయం వద్ద భక్తుల విరాళాలతో అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో అంగర, పడమరఖండ్రిక గ్రామస్థులతో పాటు, పరిసర గ్రామాల ప్రజలు, భక్తులు, ఆలయ కమిటీ, తదితరులు పాల్గొన్నారు.


అంగరలో ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన వేంకటేశ్వరస్వామివారు

వినాయక చవితి ఉత్సవాలకు రాట ముహూర్తం

కపిలేశ్వరపురం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : అంగరలో ఈనెల 27 నుంచి జరగనున్న వినాయక చవితి ఉత్సవాలకు శనివారం రాట ముహూర్తం జరిపారు. ఆదిగణపతి నిర్వహణ కమిటీ అధ్యక్షుడు పెద్దింశెట్టి సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో రాటకు ప్రత్యేక పూజలు నిర్వహించి ముహూర్తం చేశారు. అవిఘ్నాలు జరగకుండా గణపతి నవరాత్రులు సక్రమంగా జరగాలంటూ గణనాధుని ప్రార్థించారు. కార్యక్రమంలో పెద్దింశెట్టి వీరబాబు, చీకట్ల గంగరాజు, ఎం. కొండ, పి. రామకృష్ణ, ఎస్. గోవిందు, ఎస్. కృష్ణ, తదితరులు, అంగర, పడమరఖండ్రిక తాపీమేస్త్రీల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.


అంగరలో చవితి ఉత్సవాలకు రాట ముహూర్తం నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా చండీ హోమం

ఐ.పోలవరం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో శనివారం పి.శ్యామలకుమార్ ఆధ్వర్యంలో చండీ హోమం జరిగింది. 118 మంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో కె. శ్రీనివాసరాజు, ఆకొండి కిరణ్ పాల్గొన్నారు.

ఆత్మీయత, అనురాగాలకు ప్రతీక రక్షాబంధన్

మంత్రి సుభాష్


రాయవరంలో అన్నకు రాఖీ కడుతున్న చెల్లెలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఆడపడుచులు వేసే ప్రతి అడుగులో అన్నగా ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలు పంచుకుంటానని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శనివారం రామచంద్రపురం పట్టణంలోని రాజగోపాల్ సెంటర్‌లో నిర్వహించిన రక్షాబంధన్ వేడుకల్లో మంత్రి ప్రసంగించారు. సోదరి, సోదరుల మధ్య ఆత్మీయత, అనురాగాలకు ప్రతీక రక్షాబంధన్ అని అన్నారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. ఈసందర్భంగా కేకు కట్‌చేసి మహిళలకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మహిళలు మంత్రి సుభాష్‌కు రాఖీలు కట్టి ఆశీర్వచనాలు తీసుకున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా నాయకురాలు జాస్తి విజయలక్ష్మి, వైట్ల గజలక్ష్మి, దమ్మలపాటి లక్ష్మి, బళ్లలక్ష్మి, వందలాది మంది మహిళలు పాల్గొన్నారు.


ఆత్రేయపురం మండలం వాడపల్లిలో తమ్ముడికి రాఖీ కడుతున్న అక్క

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. రక్షాబంధన్ కట్టి ఒకరినొకరు స్వీట్లు ఇచ్చుకుని, బహుమతులు అందజేశారు.

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం రక్షాబంధన్ వేడుకలను ప్రజలు ఉత్సాహంగా జరుపుకున్నారు. ఆయా ప్రాంతాల్లో సోదరులకు రాఖీలు కట్టి ఆశీస్సులు తీసుకున్నారు.

రాయవరం, (ఆంధ్రజ్యోతి): సోదర ప్రేమకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్‌ను మండలంలోని ఆయా ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన రాయవరం, వి.సావరం, నదురుబాద, వెదురుపాక, లొల్ల, సోమేశ్వరం, మాచవరం, పసలపూడి, చెల్లూరు, వెంటూరు, కూర్మాపురం, కురకాళ్లపల్లి గ్రామాల్లో పలువురు సోదరులు రాఖీలు కట్టి వారికి ఆశీర్వచనాలు అందజేసి బహుమతులు పొందారు.

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో రాఖీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు రాఖీలు కట్టి వారికి ఆశీస్సులు అందజేశారు. ఒకరినొకరు స్వీట్స్ తినిపించుకుని పలువురు సందడి చేశారు.


కె.గంగవరం మండలం కోటిపల్లిలో సోదరులకు రాఖీ కట్టిన సోదరి

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): మండలంలో రాఖీ పండుగను ఆయా ప్రాంతాల్లో ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని ఓంశాంతి బ్రహ్మకుమారీస్ ప్రజా ప్రతినిధులకు, ప్రజలకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

సిద్దార్థనగర్‌లో పారిశుధ్యం పనులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రావులపాలెం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): సిద్దార్థనగర్‌లో వీధుల్లో మురుగు ప్రవహిస్తూ దుర్గంధం వెదజల్లుతుండటంతో ఇళ్ల ముంగిట మురుగు నీరు శీర్షికతో శనివారం ఆంధ్ర జ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు మురుగునీరు మళ్లించి పారిశుధ్యం పనులు చేపట్టారు. ఆ ప్రాంతంలో సర్పంచ్ సబ్బితి మోహనరావు, కార్యదర్శి పట్టాభిరామయ్యలు పర్యటించి పారిశుధ్యం పనులు చేపట్టారు.


మారేడు దళాలతో నవజనార్దనస్వామికి ప్రత్యేక పూజలు జరిపిన దృశ్యం

జనార్దనస్వామికి ప్రత్యేక పూజలు

ఆలమూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం శనివారంతోపాటు శ్రవణా నక్షత్రం సందర్భంగా ఆలమూరులోనున్న శ్రీదేవి భూదేవి సమేత నవజనార్దనస్వామికి మారేడు దళాలతో ప్రత్యేక పూజను నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు ఖండవల్లి ప్రభాకరాచార్యులు అధ్వర్యంలో స్వామివారికి ముందుగా అభిషేకాలు నిర్వహించి అనంతరం మారేడు దళాలతో ప్రత్యేక పూజను చేశారు. అనంతరం భక్తులు ఆలయంలోని వెండి పూలతో పూజలు చేశారు. జనార్దనస్వామి భక్త మండలి సభ్యులతోపాటు అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

విద్యుత్ సర్వీసుల తొలగింపునకు చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆత్రేయపురం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం వద్దిపర్రులో మృతి చెందిన పల్లికొండ అర్జయ్య పేరున 17 విద్యుత్ సర్వీసులను తొలగించేందుకు చర్యలు చేపట్టారు. ఈనెల 6న ఆంధ్రజ్యోతిలో విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం...కుటుంబానికి శాపం, మృతుడి పేరుతో 17 విద్యుత్ కనెక్షన్లు, రేషన్ కార్డుల దరఖాస్తులో బట్టబయలు శీర్షికన వెలువడిన కథనంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. అర్జయ్య మనువడు దివ్యాంగుడు కావడంతో ప్రభుత్వ పథకాలు అందని పరిస్థితి ఏర్పడింది. ట్రాన్స్‌కో ఈఈ రవికుమార్ ఆదేశాల మేరకు విద్యుత్ సర్వీసులను తొలగించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఏఈ తెలిపారు.

అమ్మ సీతమ్మ సేవా సమితి సేవలు అభినందనీయం

కొత్తపేట, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): అమ్మ సీతమ్మ సేవా సమితి సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తనయుడు సందీప్ అన్నారు. శనివారం సేవా సమితి వార్షికోత్సవాన్ని పురస్కరించు కుని ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో అన్నదానాన్ని ప్రారంభించారు. అనంతరం రోగులకు రొట్టె, పండ్లు పంపిణీ చేశారు. తొలుత డొక్కా సీతమ్మ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వార్షికోత్సవాన్ని నిర్వహించారు. రావులపాలెం మండలం లక్ష్మీపోలవరం గ్రామానికి చెందిన యువకులు ఏడాది క్రితం అమ్మ సీతమ్మ పేరుతో చారిటబుల్ ట్రస్టును ఏర్పాటు చేసి పలు సేవా కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బూసి జయలక్ష్మి, ముత్యాల బాబ్జి, కంఠంశెట్టి శ్రీనివాస్, సలాది రామకృష్ణ, గనిశెట్టి వీరేష్, ఉపసర్పంచ్ విళ్ల మారుతీ ప్రసాద్, గుబ్బల మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

ఎమ్మెల్యే వేగుళ్ల


ఇప్పనపాడులో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

మండపేట, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డబుల్ ఇంజన్ స్పీడ్‌తో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతోందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. ఇప్పనపాడు గ్రామంలో నిర్మించిన సచివాలయ భవనాలను శనివారం ఆయన స్థానిక సర్పంచ్ కుంచే వీరమణితో కలిసి ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గ్రామంలోని సమస్యలను సర్పంచ్ ఆయన దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. తొలుత గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు సర్పంచ్ వీరమణి తదితరులు వేదపండితుల మంత్రాల మధ్య పూర్ణకుంభ స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, వేగుళ్ల అజయ్‌బాబు ఎస్.వీర్రెడ్డి, సుబ్బారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చింతపల్లి రామకృష్ణ తదితరులతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత: వివిధ వ్యాధులతో బాధపడుతూ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న 36 మందికి రూ.20.23 లక్షల చెక్కులను ఎమ్మెల్యే శనివారం టీడీపీ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.


ద్వారపూడిలో కొలువుతీరిన దేవాలయాల పాలకవర్గాలు

నూతన పాలకవర్గాలు ప్రమాణ స్వీకారం

మండపేట, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): దేవాలయాల అభివృద్ధికి పాలకమండళ్లు పనిచేయాలని ఆధ్యాత్మికవేత్త నాగబాబు కోరారు. ద్వారపూడిలో వున్న రాజ్యలక్ష్మీ అమ్మవారి ఆలయం, రాజగోపాలస్వామి ఆలయ పాలకమండలి ప్రమాణ స్వీకారం శనివారం జరిగింది. ద్వారపూడి ఆలయ ప్రాంగ ణంలో రాజ్యలక్ష్మీ అమ్మవారి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్‌గా నక్కా శ్రీనివాసరావుతోపాటు 9మంది సభ్యులు, రాజగోపాలస్వామి ఆలయ పాలక మండలి ధర్మకర్తల మండలి అధ్యక్షుడిగా పి.నానాజీతో పాటు మరో 9మంది పాలకవర్గ సభ్యులతో దేవదాయ ధర్మాదాయశాఖ ఉద్యోగులు ప్రమాణ స్వీకారం చేశారు. నూతన పాలకమండలి సభ్యులను స్థానిక నేతలు అభినందించారు. కార్యక్రమంలో స్థానిక నేతలతో పాటు టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు యరగతపు బాబ్జి, సహకార సంఘ అధ్యక్షుడు సలాది బాల సుబ్రహ్మణ్యం, గోణం పుల్లయ్య, చేకూరి రమేష్ రాజు, కూటమినేతలు పాల్గొన్నారు.

హీరో మహేష్‌బాబు సేవా కార్యక్రమాలు భేష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): హీరో మహేష్‌బాబు సేవా కార్యక్రమాలతో నిజ జీవితంలోను శ్రీమంతుడని మంత్రి సుభాష్ అన్నారు. శనివారం ద్రాక్షారామలో హీరో మహేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని రోటరీ క్లబ్, మహేష్‌బాబు ఫౌండేషన్ ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. మహిళలకు 6 కుట్టుమిషన్లు, స్కూల్ విద్యార్థులకు క్రీడా సామగ్రి, క్రికెట్ కిట్లు, వీధి వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎంతో మంది చిన్నపిల్లలకు గుండె శస్త్ర చికిత్సలు చేసి ప్రాణాలు కాపాడారన్నారు. ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని అన్నారు. కార్యక్రమంలో మహిళలకు క్యాన్సర్ స్కీనింగ్ టెస్టులు చేశారు. కార్యక్రమంలో రికీ హాస్పిటల్, రికీ ట్రినీటి, ద్రాక్షారామ పీఏసీసీఎస్ త్రిమేన్ కమిటీ చైర్మన్ ముప్పనపల్లి గణేష్, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, తడాల వర ప్రసాద్, కూటమి పార్టీ నాయకులు సలాది శ్రీనివాస్, అరిగెల బాబి, మల్లిపూడి బుజ్జి, కర్ర తాతీలు, ఆళ్ల బుజ్జి, నేదునూరి నారాయణ, ఆచంట శోభన్‌బాబు, మహేష్‌బాబు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.


మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న మంత్రి సుభాష్

చిన్నారుల తులాభారం

కపిలేశ్వరపురం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : అంగరలోనున్న వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం చిన్నారుల తులాభారం ఘనంగా జరిగింది. చిన్నారుల మొక్కు చెల్లించేందుకు ఆలయానికి వచ్చిన భక్తులకు సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చిన్నారుల తల్లిదండ్రులు పటిక బెల్లంతో తులాభారం నిర్వహించారు. ఆలయ అర్చకులు బాలబాలాజి ఆచార్యులు ఆధ్వర్యంలో పలువురు పండితుల వేద మంత్రోశ్చరణల మధ్య ఆశీర్వచనాలు అందించి స్వామివారి దర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమాల్లో చిన్నారులు, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొన్నారు.


పటిక బెల్లంతో తులాభారం నిర్వహిస్తున్న దృశ్యం

దొంగకు ఈదరాడ ప్రజలు దేహశుద్ధి

మామిడికుదురు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఈదరాడలో దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని పట్టుకుని దేహశుద్ధి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన కొబ్బరికాయల వ్యాపారి లంకలపల్లి సత్యనారాయణ వైద్య పరీక్షల కోసం ఇంటికి తాళం వేసి భార్యతో కలిసి హైదరాబాద్ వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేరని తెలుసుకున్న పశ్చిమగోదావరి జిల్లా పెనుమంచిలి చెందిన మార్గాని గోపాలకృష్ణ ఈనెల3న దొంగతనానికి పాల్పడ్డాడు. పారిపోయే ప్రయత్నంలో అతడిని గ్రామస్తులకు పట్టుబడడంతో స్థానికులు దేహశుద్ధిచేసి నగరం పోలీసులకు అప్పగించారు. అతడి వద్ద నుంచి రూ.7వేల నగదును పోలీసులకు స్వాధీనం చేసుకున్నారు. బాధితుడి అల్లుడు యెరుబండి గోవింద విజయరామమూర్తి ఫిర్యాదుపై ఈనెల4న కేసు నమోదు చేశామని నగరం ఎస్ఐ ఎ.చైతన్య కుమార్ తెలిపారు. నిందితుడికి రాజోలు కోర్టు రిమాండు విధించిందన్నారు.


ఆలమూరులో ఏకలవ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆలమూరులో ఆదివాసీ దినోత్సవం

ఆలమూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఆలమూరులో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలమూరులోని ఎరుకుల కాలనీలోని ఏకలవ్య విగ్రహానికి పలువురు నివాళులర్పించారు. ఏకలవ్య యువజన సంఘం అధ్వర్యంలో ఏకలవ్య విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఆలమూరు ఎరుకుల సంక్షేమ సంఘం నాయకులు గాడా రాంబాబు, గోవిందు, అమలదాసు రాంబాబు, కంపశెట్టి పట్టాభి, సూరిబాబు, గాడా నాగు తదితరులు పాల్గొన్నారు.


ఆలమూరులోనున్న సంతోషిమాత అమ్మవారు

సంతోషిమాతకు జన్మదిన పూజలు

ఆలమూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): సంతోషిమాత జన్మదినం సందర్భంగా ఆలమూరులోని సంతోషిమాత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వెలవలపల్లి చైతన్యతోపాటు విజయ్, రాంబాబుల అధ్వర్యంలో అభిషేకాలు, లక్ష కుంకుమార్చనలు జరిపారు. అనంతరం పెన్నులతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం విద్యార్థులకు వాటిని పంపిణీ చేశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు జరిపారు.

లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అన్న ప్రసాదం ప్రారంభం

ఆత్రేయపురం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి శ్రవణ నక్షత్రం సందర్భంగా స్వామివారి మాస కల్యాణం నిర్వహించారు. శనివారం నుంచి ఆలయంలో అన్నప్రసాదం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆలయ చైర్మన్ పాతపాటి వెంకట సత్యనారాయణరాజు, రాజ్యలక్ష్మి దంపతులు దీనికి శ్రీకారం చుట్టారు. శనివారం ఆనంద గ్రూప్ డైరెక్టర్ భీమవరం, ఉద్దరాజు శ్రీనివాసరాజు, పద్మ దంపతుల మనవరాలు విహన్వి చేతుల మీదుగా అన్నదానం ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నదానంలో పాల్గొన్నారు.

అగస్త్యేశ్వరస్వామి ధర్మకర్తల మండలి ఏర్పాటు

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పట్టణంలో నున్న అగస్త్యేశ్వరస్వామి ఆలయానికి నూతనంగా ధర్మకర్తల మండలి ఏర్పాటు చేస్తూ దేవదాయశాఖ కమిషనరు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ధర్మకర్తల మండలి సభ్యులుగా చెరుకుపల్లి వెంకట రామగణేష్, సుతాపల్లి వీరవెంకట నాగ సుబ్రహ్మణ్యం, కిల్లి వెంకటాచల వరహాగిరి, ఆదివారపు దనలక్ష్మి, వాసంశెట్టి వెంకట సత్యనారాయణ, మన్ని దుర్గాలక్ష్మి, తొగరు లక్ష్మి, లంక వెంకట దుర్గ, శాకా వీరన్న, కొత్తలంక వెద్రియ్యశాస్త్రిలను నియమించారు.

చైర్మన్‌గా గణేష్‌శర్మ: ధర్మకర్తల మండలి చైర్మన్‌గా చెరుకుపల్లి వెంకట రామగణేష్‌వర్మ ఎన్నికకానున్నారు. ఇప్పటికే గణేష్ శర్మ ను అగస్త్యేశ్వరస్వామి ధర్మకర్తల మండలి చైర్మన్‌గా మంత్రి సుభాష్ ప్రకటించారు.